ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శనివారం 20 జనవరి 2024

సీనియర్ల సంగతేంటి?

ఉమ్మడి పశ్చిమ గోదావరి రాజకీయాల్లో ఎందరో నాయకులు తమకంటూ ఓ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. వారిలో కొందరు తటస్థంగా, మరికొందరు సైలెంట్‌గా మిగిలారు. ఇంకొందరు మంత్రి స్థాయి హోదాలను అనుభవించి, రాజకీయ సీనియార్టీ సాధించి ఆయా పార్టీల్లోనే కొనసాగుతున్నారు. పార్టీ సీటు ఇస్తే పోటీ చేయడానికి సిద్ధమవుతు న్నారు. ఇలా తెలుగుదేశం పార్టీలో ప్రముఖ నేతలుగా గుర్తింపు పొందిన పలువురి నేతల తాజా రాజకీయ పరిస్థితిపై ప్రత్యేక కథనం.


కొత్తపల్లి | సుజాత | జవహర్ | అంజిబాబు | ఈలి నాని

- మాజీ మంత్రులు కొత్తపల్లి, సుజాత, జవహర్‌లకు చోటెక్కడ ?
- భీమవరాన్ని ఏలిన అంజిబాబు, తాడేపల్లిగూడెంలో ఈలి నానిల రూటెటు ?
- ఎన్నికల యుద్ధంలో వీరి పాత్ర ఏమిటి ?

తెలుగుదేశంలో చక్రం తిప్పిన నేతలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ఒకప్పుడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అత్యంత కీలకంగా దశాబ్దాల తరబడి జిల్లాలో ఏకచత్రాధిపత్యం సాధించిన వారిలో నరసాపురం మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత కొత్తపల్లి సుబ్బారాయుడు ఒకరు. ఎన్టీఆర్ హయాం నుంచి ఆయన రాజకీయాల్లో రాణించారు. పలుసార్లు ఎమ్మెల్యేగా రాణించి జిల్లా అంతటా పట్టు బిగించి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యత వహించారు. రానురాను రాజకీయ సమీకరణలకు అనుగుణంగా ఆయన తెలుగుదేశం నుంచి తప్పుకుని కాంగ్రెస్‌లో చేరారు. కొన్నాళ్లపాటు ఆ పార్టీలో కొనసాగిన అనంతరం వైసీపీలో చేరారు. చాన్నాళ్లపాటు ఆ పార్టీలోనే చక్రం తిప్పేందుకు ప్రయత్నించారు. స్థానిక రాజకీయాలు గిట్టక ఆయన అసంతృప్తి గళం విప్పారు. అంతే.. అమాంతం వైసీపీ నుంచి ఆయనను సైడొలిగేలా చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్తపల్లి ఏ పార్టీ వైపు తొంగి చూడలేదు. ప్రత్యేకించి కాపు సామాజిక వర్గంలో విస్తృత పేరు ఉన్న ఆయనను ఆ రూపంలో వినియోగించుకునేందుకు ప్రయత్నాలు జరిగాయి. కొన్నాళ్లపాటు ఆరోగ్యం సహకరించకపోయినా క్రియాశీలక రాజకీయాల్లో కొత్తపల్లి తన పాత్ర పోషించారు. గడిచిన ఐదేళ్లల్లో ఆయన దాదాపు సైలెంట్‌గానే ఉన్నారు. ఇప్పుడు ఎన్నికల వేళ ఆయన ఎక్కడైనా తిరిగి పోటీ చేస్తారా, లేదా అనేది తేల్చుకోవాల్సి ఉంది. కొత్తపల్లి వంటి సీనియర్ నేత సహకారం అందుకోవడానికి ఇప్పటికే కొన్ని ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. జనసేన సైతం కొత్తపల్లికి అండగా నిలబడుతుందని కొన్నాళ్లపాటు విస్తృత ప్రచారం సాగింది. ఆ తర్వాత ఇది కాస్తా నిలిచిపోయింది.

మాజీ మంత్రులది తలోదారి

చంద్రబాబు మంత్రి వర్గంలో మంత్రులుగా పనిచేసిన పీతల సుజాత, కె.ఎస్.జవహర్ ఇప్పటికీ ఎదురీదుతున్నారు. కొవ్వూరు రాజకీయాల్లో జవహర్ అసమ్మతిని ఎదుర్కొన్నారు. ఓ వర్గం ఆయనను పూర్తిగా వ్యతిరేకించింది. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆయన కొనసాగనీయకుండా చేసింది. అధిష్ఠానం అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి నియోజకవర్గ టీడీపీ నిర్వహణ బాధ్యతలను జవహర్‌ను కాదని ద్విసభ్య కమిటీకి అప్పగించారు. ఆ తర్వాత రాజమహేంద్రవరం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా జవహర్‌ను నియమించారు. ఆయన ఆ బాధ్యత ల్లో సక్సెస్ అయ్యేలా నిరంతరం ప్రయత్నించారు. ఇప్పుడు తాజాగా జవహర్‌కు ఎక్కడి నుంచి పోటీ చేసే అవకాశం కల్పిస్తారనే దానిపై సస్పెన్స్ నెలకొంది. తాను కొవ్వూరు నుంచి పోటీ చేయడానికే సిద్ధమని, దానికి అవకాశం కల్పించాల్సింది గా అధినేత చంద్రబాబుకు పదేపదే విన్నవించారు. ఆయన అనుచరులు సైతం పట్టుపడుతూనే ఉన్నారు. అధిష్ఠానం ఇప్పటి వరకు జవహర్‌కు ఎక్కడ అవకాశం ఇవ్వబోతున్నారనే దానిపై సంకేతాలు ఇవ్వలేదు. మరో మాజీ మంత్రి పీతల సుజాత చింతలపూడి నియోజకవర్గం నుంచి ఒకప్పుడు హల్‌చల్ చేశారు. టీడీపీ అధిష్ఠానానికి చేరువయ్యారు. ఆ నియోజకవర్గంలో టీడీపీ వర్గాల మధ్య విభేదాలు పొడచూపడంతో 2019 ఎన్నికల్లో ఆమెను కాదనుకుని డాక్టర్ రాజారావుకు అవకాశం ఇచ్చారు. ఆయన ఓటమి చెందడంతోపాటు తదుపరి మృతి చెందారు. అప్పటి నుంచి చింతలపూడి నియోజకవర్గంలో సుజాతకు గాని, ఇంకొకరికి గాని నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించలేదు. సుజాత వీలు చిక్కినప్పుడల్లా చింతలపూడి నియోజకవర్గంలో వివాహ వేడుకలకు హాజరుకావడం, మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శిస్తున్నారు. ఎన్నికల వేళ సుజాతను వీలైతే కొవ్వూరు అసెంబ్లీ స్థానానికి పంపుతారని కొందరు ప్రచారం చేసినా అధినాయకత్వం నుంచి ఎలాంటి సంకేతాలు వెలువడలేదు. అధిష్ఠానం ఆలోచనకు అనుగుణంగా పార్టీకి కట్టుబడి ఉంటానని ఆమె చెబుతున్నారు.

అంజిబాబు ఎక్కడ ?

2014 ఎన్నికల్లో భీమవరం నుంచి ఎమ్మెల్యేగా తెలుగుదేశం పార్టీ నుంచి గెలిచిన పులపర్తి ఆంజనేయులు(అంజిబాబు) 2019 అనంతరం క్రియాశీలక రాజకీయాలకు దాదాపు దూరంగా నిలిచారు. వ్యక్తిగతంగా క్రమశిక్షణ కలిగిన ఆయన కొన్ని కీలక వ్యవహారాల్లో ముక్కుసూటిగా వ్యవహరించారు. మాజీ మంత్రి ఘంటా శ్రీనివాస్‌తో బంధుత్వం ఉన్న ఆయన ఘంటా బాట ఎటు అయితే ఆయన అటేనంటూ అంజిబాబు అనుచరులు కొన్నాళ్లపాటు ప్రచారం చేశారు. రానురాను టీడీపీ వ్యవహారాల్లో ఆయన పాత్ర అంతంత మాత్రంగానే మిగిలింది. భీమవరం రాజకీయాల్లో అంజిబాబు తిరిగి పుంజుకుంటారని భావించినా గతంలో ఈ నియోజకవర్గం నుంచి జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పోటీ పడడంతో అప్పట్లో అంజిబాబుకు పోటీ చేసే ఛాన్స్ ఇవ్వలేదు. దీని దరిమిలా విశాఖ జిల్లాలో ఘంటా శ్రీనివాసరావు టీడీపీ వ్యవహారాల్లో జోరు పెంచారు. తదనుగుణంగానే భీమవరంలోను అంజిబాబు కొంత వేగంగా రాజకీయాల్లో ముందుకు కదులుతారని అంతా ఊహించారు. అయితే ఇప్పటివరకు ఆయన భవిష్యత్ మార్గం ఏమిటనేది నిర్ధారించలేదు.

ఈలి నాని రూటెటు..?

ఒకప్పుడు చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ తరపున తాడేపల్లిగూడెం నుంచి ఎన్నికైన ఈలి నాని చాన్నాళ్లపాటు అక్కడి రాజకీయాల్లో వెలుగొందారు. ఆ తర్వాత టీడీపీలో చేరిన ఆయన అక్కడ నిలదొక్కుకోవడానికి ప్రయత్నించారు. ప్రత్యేకించి అక్కడ ఉన్న సామాజిక పరిస్థితుల నేపథ్యంలో తాను, తన కేడర్ సైతం క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగేలా ప్రయత్నించారు. కొంత కాలంగా కొన్ని రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఆయనకు తగిన ప్రాధాన్యత వస్తుందని అందరూ ఊహించారు. దీనిపై విస్తృత ప్రచారం జరిగింది. కాని మాజీ ఎమ్మెల్యే నాని అటూ ఇటూ తేల్చుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలోనే ఈసారి జరగబోయే ఎన్నికల్లో ఆయన ఇమేజ్‌ను ప్రధాన పార్టీల్లో ఏ పార్టీ అందుకుని లబ్ధి పొందబోతుందనే దానిపై సస్పెన్స్ నెలకొంది.

సా..గుతున్న రబీ

- ఇప్పటి వరకు 46.99 శాతం పూర్తి
- 2,883 ఎకరాల్లో వరి నారుమళ్లు.. 45,417 ఎకరాల్లో నాట్లు పూర్తి

ఏలూరు సిటీ, జనవరి 19 : జిల్లాలో రబీ పంటల సాగు పనులు దాదాపు పూర్తి కావాల్సి ఉండగా ఇంకా ఇప్పటికీ 46.99 శాతం మాత్రమే వివిధ పంటల సాగు పూర్తయిందని జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నారు. ఈ ఏడాది రబీలో వరి 98,726 ఎకరాల్లో చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. దీనికి సంబంధించి 4,936 ఎకరాల్లో నారుమళ్ల వేయాల్సి ఉండగా ఇప్పటివరకు 2,883 ఎకరాల్లో మాత్రమే వరి నారుమళ్ల వేయగా 45,417 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. అంటే నారుమళ్ల విషయంలో 58.40 శాతం, నాట్లు విషయంలో 46 శాతం పూర్తయిందని వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. జొన్న పంట 96 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 19 ఎకరాల్లో మాత్రమే సాగు ప్రారంభమైంది. రబీలో జిల్లాలో ప్రధాన పంట మొక్కజొన్న 1,04,261 ఎకరాల్లో సాగు ప్రారంభించాల్సి ఉండగా ఇప్పటివరకు 39,291 ఎకరాల్లోనే సాగు మొదలైంది. ఇక అపరాల విషయానికి వస్తే కందులు 25 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు సాగు ఆరంభం కాలేదు. పెసలు 16,963 ఎకరాల్లో ప్రారంభించాల్సి ఉండగా 10,568 ఎకరాల్లో, మినుములు 25,088 ఎకరాలకు గాను ఇప్పటివరకు 14,319 ఎకరాల్లో సాగు ప్రారంభమైంది. నూనె పంటలు 3,029 ఎకరాలకు గాను 2187 ఎకరాల్లోనే సాగు మొదలైంది. ఇందులో ప్రధానంగా వేరుశనగ 2,515 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 2,187 ఎకరాల్లో సాగు ప్రారంభమైంది. నువ్వులు, సన్‌ఫ్లవర్ పంటలు ఇంకా సాగు మొదలు కాలేదు. వాణిజ్య పంటల సాగులో ప్రధానంగా చెరకు 4,710 ఎకరాలకు గాను 526 ఎకరాల్లో, పొగాకు 27,364 ఎకరాలకు గాను 19,150 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం రబీలో పంటల పరిస్థితులను పరిశీలిస్తే కొంత జాప్యం జరుగుతోంది. ఇప్పటికే జిల్లాలో వరి నారుమళ్ల పూర్తి కావాల్సి ఉండగా ఇంకా నారుమళ్ల వేస్తూనే ఉన్నారు. వరి నాట్లు కూడా పూర్తి స్థాయిలో పడలేదు. సకాలంలో కాల్వలకు నీరు విడుదల చేసినా అవి శివారు భూములకు చేరే సరికి ఆలస్యం కావడంతో సాగులో జాప్యం జరుగుతోందని తెలుస్తోంది. మిచౌంగ్ తుపాను కారణంగా సార్వా వరి సాగులో జాప్యం జరగడంతో ఆ ప్రభావం రబీపై పడింది.

దిగొచ్చిన కూరగాయలు



నరసాపురం, జనవరి 19: కూరగాయల ధరలు దిగొస్తున్నాయి. నాలుగు రోజులుగా ఒక్కొక్కటి తగ్గుతూ వస్తున్నాయి. జిల్లాలో కూరగాయల పంట చేతికి రావడమే కారణమని చెబుతున్నారు. మరో పది రోజులు పోతే అన్నీ సాధారణ స్థితికి వస్తాయంటున్నారు. నిన్న, మొన్నటి వరకు కేజీ రూ 100 పలికిన వంకాయలు నేడు రూ.40కి దిగాయి. దొండకాయ కూడా ఇదే రకంగా తగ్గింది. రూ.80 వరకు అమ్మగా కేజీ రూ.30కి పడిపోయింది. దోసకాయలు కూడా కేజీ రూ 30కి వచ్చాయి. మొన్నటి వరకు రూ.60 అమ్మారు. బెండకాయ కేజీ రూ.60కి దిగింది. టమాట కేజీకి పది తగ్గింది. శుక్రవారం రైతుబజార్‌లో కేజీ రూ.30 పలికింది. క్యారెట్ కూడా కేజీ రూ.50కి దిగింది. చిక్కుడు కేజీ రూ.120 నుంచి తగ్గి రూ.70-80 మధ్య ఉంది. బీరకాయ మాత్రం కేజీ రూ.80 దగ్గరే ఉంది. కాకరకాయ కొద్ది చేదు తగ్గింది. కేజీ 80 నుంచి రూ.60కి పడింది. బీట్‌రూట్ కూడా రూ.50కి చేరింది. జిల్లాలో సిద్ధాంతం, కాకరపర్రు, గోపాల పురం,నరసాపురం, మొగల్తూరు, కందరవల్లి, కేదార్‌లంక, తదితర గ్రామీణ ప్రాంతాల్లో కూరగాయల పంట చేతికొస్తున్నాయి. మరో పది రోజులు పోతే బీర, చిక్కుడు, బెండ కూడా దిగుబడి పెరిగే అవకాశాలు ఉన్నాయి. అప్పుడు ధరలు సగానికి సగం తగ్గే అవకాశం ఉంది.



• అంగన్‌వాడీల నిరసన దీక్ష

ఏలూరు కలెక్టరేట్, జనవరి 19 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా అంగన్ వాడీల సమ్మె శుక్రవారానికి 39వ రోజుకు చేరింది. ఏలూరు కలెక్టరేట్ వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం 24 గంటల రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరిస్తున్నారు కాని ఆయన ఆశించిన పనులను మాత్రం ప్రభుత్వం చేయడం లేదని ఎద్దేవా చేశారు. దీక్షల్లో వినీత, భాగ్యలక్ష్మి, పి.రమాదేవి, నాగమణి, శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ నాయకులు రజినీ, అరుణ, నవతి, సీఐటీయూ నాయకులు సాయిబాబు, జగన్నాథరావు, కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



• మోకాళ్లపై టీచర్ల నిరసన

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 19 : పెండింగ్‌లో వున్న ఆర్థిక బకాయిలన్నింటినీ వెంటనే చెల్లించా లని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ రాష్ట్రశాఖ పిలు పు మేరకు శుక్రవారం సంఘ జిల్లా నాయకు లు, టీచర్లు ఏలూరులో నిరసన ప్రదర్శన నిర్వహిం చారు. సంఘ జిల్లా కార్యాలయం నుంచి ర్యాలీగా ఫైర్‌స్టేషన్ సెంటర్‌కు చేరుకుని నినాదాలు చేశారు. నల్లరిబ్బన్లను కళ్లకు కట్టుకోవడం, మోకాళ్లమీద నిరసన, కొవ్వొత్తులతో ప్రదర్శన జరిగాయి. ఉద్యో గులు, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ విధానాలను నిరసించారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు షేక్ ముస్తఫా అలీ, రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి సుభాషిణి, రంగమోహన్, కనకదుర్గ, శివ శంకరరావు, సుధారాణి, కమల్‌కుమార్, మోహన రావు, పీవీ నరసింహారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఏజెన్సీ పోలీసా మజాకా..!



ఏలూరు క్రైం, జనవరి 19 : సంక్రాంతి పండుగ పేరు చెప్పి ఏజెన్సీ ప్రాంతంలోని కొంతమంది పోలీసు అధికారులు, కానిస్టేబుళ్ల యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడ్డారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వేలేరుపాడులో పేకాట శిబిరంపై జరిపిన దాడుల్లో పట్టుబడిన సొమ్మును కేసులో పూర్తిస్థాయిలో చూపించకుండా పక్కకు మళ్లించడంతో జూదగాళ్లే స్వయంగా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏజెన్సీ పోలీసా ... మజాకా అంటూ ఆ ప్రాంత ప్రజలతో పాటు పోలీస్ శాఖలోనే చర్చించుకోవడం విశేషం. ఏజెన్సీ ప్రాంతాలకు ఉన్నతాధికారులు రావాలన్నా తమకు చెప్పే రావాలి.. అన్న ధీమా అక్కడ పోలీసులు వ్యక్తం చేస్తూ అసాంఘిక కార్యకలాపాలకు అనుమ తులు ఇస్తున్నారనే ప్రచారం ఉంది.

- ఈ ప్రాంతంలోని కుక్కునూరు, చీరవల్లి, వేలేరు గ్రామాల్లో జరిగిన కోడి పందేలకు తెలంగాణ ప్రాంతాలైన భద్రాచలం, పాల్వంచ, కొత్త గూడెం, మణుగూరు ప్రాంతాలకు చెందిన పలువురు జూదగాళ్ళు, కోడి పందేల రాయుళ్ళు భారీగా వాహనాల్లో తరలివచ్చారు. ఈ వాహనాల వల్ల వేలేరులో పండుగ రోజున 108 అంబులెన్స్ అర్ధగంట పాటు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయిందంటే అక్కడ పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు దరిదాపుల్లోకి రాకపోవడంతో ప్రజలే క్రమబద్ధీకరణ చేసుకుని 108కు దారి ఇచ్చారు. మరోవైపు ఏజెన్సీ ప్రాంతంలోని కొంతమంది కానిస్టేబుళ్ల పండుగను అడ్డం పెట్టుకుని వసూళ్లకు పాల్పడారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వేలేరుపాడు

- పేకాటలో దొరికిన సొమ్ము ఓ అధికారి.. కాజేశారంటూ ఎస్పీ కార్యాలయానికి ఫిర్యాదు

మండల కేంద్రంలో ఒక పొగాకు బ్యారన్‌లో ఈనెల 15వ తేదీ రాత్రి 15 మంది పేకాట ఆడుతుంటే ఒక పోలీస్ అధికారి తన సిబ్బందితో దాడి చేశారు. 88 వేల 80 రూపాయలు సీజ్ చేస్తూ వీడియో తీశారని పేకాట రాయుళ్ల చెబుతున్నారు. ఆ వీడియోను మధ్యలో ఆపి వారి వద్ద ఉన్న నగదు మూడు లక్షల 67 వేల రూపాయలు స్వాధీనం చేసుకుని ఆ సొమ్ములను కేసులో సీజ్ చేసినట్టు చూపించ లేదని, పేకాట ప్రాంతంలో దాచిన మరో లక్షా 50 వేల రూపాయల నగదు కూడా అధికారి తీసుకు న్నట్టు చెబుతున్నారు. ఒక నాయకుడు ఆ అధికారిని నిలదీయడంతో అతనికి రూ.40 వేలు వెనక్కి ఇచ్చేసినట్టు చెబుతున్నారు. మిగిలిన వాళ్ల తమ సొమ్మును అడగ్గా వారిని బెదిరించినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి రాతపూర్వకంగా ఫిర్యాదును తపాలా సెక్షన్‌లో ఈనెల 18వ తేదీన ఇచ్చినట్టు సమాచారం. పండుగనాడు అన్ని ప్రాంతాల్లో కోడిపందేలు, పేకాటలకు అనుమతులు ఇచ్చి తమపై దాడి చేయడం ఎంత వరకూ న్యాయమంటూ వాపోతున్నారు. చట్టం అందరికి సమానంగా ఉండాలని ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేసి తమకు న్యాయం చేయాలంటూ ఆ ఫిర్యాదులో పేర్కొంటు తెలుస్తోంది.

తక్కువ ఎత్తులో విమానం చక్కర్లు!

- కొత్త రైల్వే లైన్ సర్వే కోసమే?

చాత్రాయి, జనవరి 19: గత కొద్ది రోజులుగా మండ లంలో గ్రామాల మీదుగా విమానం తక్కువ ఎత్తులో ఎగురుతూ చక్కర్లు కొడుతుండటంతో ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. ప్రతి అర గంట, గంటకు విమానం తిరు గుతుండటంతో ఏం జరుగుతుందో అని ప్రజలు చర్చించు కుంటున్నారు. గ్యాస్, ఆయిల్ పైప్ లైన్ల పర్యవేక్షణ అని కొందరు, అటవీ భూములు సర్వే అని, బొగ్గు నిక్షేపాల కోసం అని మరి కొందరు అంటున్నారు. చాత్రాయి, చింతలపూడి తదితర మండలాలలో కొన్నేళ్ల క్రితం బొగ్గు నిక్షేపాలు కనుగొన్నారు. ఈ ప్రాంతంలో కోల్ మైన్స్ ప్రారంభిస్తే బొగ్గు రవాణా, ప్రయాణికుల కోసం భద్రాచ లం-కొవ్వూరు మధ్య రైల్వేలైన్ నిర్మాణం చేపట్టడానికి విమానం ద్వారా సర్వే జరుగుతున్నట్టు అనధికార సమా చారం. అయితే అధికారులెవరూ దీనిపై వివరణ ఇవ్వలేదు.

రేపు పట్టిసీమ శివరాత్రి ఉత్సవాల తొలి సమావేశం

పోలవరం, జనవరి 19 : పట్టిసీమ మహాశివరాత్రి ఉత్స వాల తొలి సమావేశం పట్టిసీమ ఫెర్రీ రేవు వద్ద శని వారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు పోల వరం తహసీల్దారు బి.సుమతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఉత్సవ కమిటీ చైర్మన్ జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతుందని అన్ని శాఖల అధికారులు ఈ సమావేశానికి విధిగా హాజరు కావాలని సూచించారు.

పసుపు రంగు మిర్చికి.. భలే డిమాండ్

- కుక్కునూరు మండలంలో ప్రయోగాత్మకంగా సాగు
- గతేడాది ఖమ్మం మార్కెట్‌లో క్వింటా రూ.60 వేల నుంచి రూ.70 వేలకు కొనుగోలు
- ప్రస్తుతం క్వింటా రూ.25 వేల నుంచి రూ.30 వేలు..
- మరోవైపు పతనమవుతున్న ఎరుపు రంగు మిర్చి ధర
- ప్రస్తుతం క్వింటా మిర్చి రూ.14 వేల నుంచి రూ.16 వేలు ..


మారేడుబాకలో పండించిన పసుపు రంగు మిర్చి

కుక్కునూరు, జనవరి 19 : మనం ఇప్పటి వరకు ఎరుపు రంగులో ఉన్న మిర్చిని చూశాం. కాని కొత్తగా నేడు పసుపు రంగు మిర్చి వచ్చేసింది. కుక్కునూరు మండలం మారేడుబాకకు చెందిన రంగారెడ్డి కృష్ణ అనే రైతు మండలంలో తొలిసారిగా పసుపు రంగు మిర్చిని ప్రయోగాత్మకంగా సాగు చేపట్టాడు. ఎరుపు రంగు మిర్చి ధరతో పోల్చితే పసుపు రంగు మిర్చికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. దీనికి ప్రధాన కారణంగా కాస్మోటిక్స్, మెడిసన్స్, పలు రకాల పచ్చళ్ల, సలాడ్స్‌లో పసుపు రంగు వినియోగం పెరుగుతున్న క్రమంలో పసుపు రంగు మిర్చికి డిమాండ్ పెరుగుతోంది. రెండేళ్ల క్రితం తెలంగాణలోని ఖమ్మం మార్కెట్‌లో ఈ పసుపు రంగు మిర్చి క్వింటా ధర దాదాపు రూ.లక్ష పలికింది. గతేడాది రూ.60 వేలు నుంచి రూ.70 వేలు పలి కింది. ఈ క్రమంలో కుక్కునూరు మండలానికి చెందిన కృష్ణ పసుపు రంగు మిర్చిని సాగు చేయడానికి ఆసక్తి చూపి తొలిసారిగా ప్రయత్నం చేశాడు. అయితే పంట ఆశాజనకంగా ఉన్న సమయంలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి కొంతవరకు పంట నష్టపోయాడు. పూత, పిందె రాలిపోయింది. వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉండేదని, ప్రస్తుతం కేవలం 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు చెబుతున్నాడు. ఎరుపు రంగు మిర్చి కన్నా పసుపు రంగు మిర్చి లాభదాయకమని తెలిపాడు. పసుపు రంగు మిర్చి క్వింటా ప్రస్తుతం రూ.25 వేలు నుంచి రూ.30 వేలు పలుకుతోంది. ఈ క్రమంలో పలువురు రైతులు ఎరుపు రంగు మిర్చి సాగుపై ఆసక్తి చూపుతూ వచ్చే ఏడాది సాగు చేయడానికి సన్నద్ధం అవుతున్నారు.

ఎరుపు రంగు మిర్చి ధర పతనం

ఈ ఏడాది మిర్చి రైతుకు కష్టాలు వీడడం లేదు. ఇప్పటికే మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి దిగుబడి తగ్గిపోయింది. ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే అవకాశం లేదు. రైతు చేతికి పది రోజులుగా పంట చేతికొస్తున్న క్రమంలో ధర క్రమంగా పతనమౌతోంది. ప్రస్తుతం క్వింటా మిర్చి రూ.14 వేలు నుంచి రూ.16 వేలు ఉంది. గతేడాది క్వింటా మిర్చి రూ.20 వేలు నుంచి రూ.25 వేలు ఉండగా ఈ ఏడాది క్రమంగా ధర పతనమవ్వడం రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. దిగుబడి తగ్గిపోవడంతో ధర లేకపోవడంతో రైతులు అప్పుల పాలయ్యే పరిస్థితి కనపడుతోంది.

2 నుంచి ఇంటర్ పరీక్షలు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 19 : ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. ఇప్పటివరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం ఏలూరు ఆర్ఐవో నేతృత్వంలో పరీక్షలు జరుగగా, ఈ ఏడాది నుంచి సమూల మార్పులు చేశారు. జిల్లాల పునర్విభజన తర్వాత తొలిసారిగా కొత్తజిల్లాల ప్రాతిపదికన ఈ పరీక్షలను నిర్వహించాలని ఇంటర్‌బోర్డు నిర్ణయించింది. ఆ ప్రకారం పరీక్షల నిర్వహణ మొదలుకుని సిబ్బంది నియామకాలు, మూల్యాంకనం తదితర పనులన్నీ ఏ జిల్లాకు ఆ జిల్లాలోనే జరుగుతాయి. ఏలూరు జిల్లాలో మొత్తం 126 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఫిబ్రవరి 2న ఎథిక్స్, హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, 3న ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ పరీక్షలతో ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయి. సైన్స్ సబ్జెక్టుల విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఒకేషనల్ విభాగంలో ఫిబ్రవరి 5 నుంచి, జనరల్ విభాగంలో 10 నుంచి జరుగుతాయి. ఈ ప్రాక్టికల్స్‌కు ఒకేషనల్ సబ్జెక్టుల్లో మొత్తం 4,501 మంది, జనరల్ విభాగంలో 9,909 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకు న్నారు. ఇక ప్రధాన పరీక్షలైన థియరీ పరీక్షలు మార్చి 1నుంచి 20 వరకు జరుగుతాయి. ఈ పరీక్షలకు జిల్లాలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 13,514 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 14,430 మంది హాజరు కావాల్సి ఉంది. జిల్లాలో 51 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా, వారం రోజుల్లో వీటి సంఖ్యను ఖరారు చేయనున్నారు. కాగా ప్రాక్టికల్ పరీక్షలకు ముందే విద్యార్థు లకు హాల్ టిక్కెట్లను అందజేయాలని నిర్ణయించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆర్ఐవో బాధ్యతలను అక్కడి డీవీఈవోకు ఇన్‌చార్జి అధికారిగా అప్పగించారు.



కృష్ణంరాజు సతీమణి, వారసుడు ప్రభాస్‌కు హామీ ఇచ్చిన రాష్ట్రమంత్రులు (ఫైల్) (ఇన్‌సెట్‌లో) దివంగత రెబల్‌స్టార్ కృష్ణంరాజు

మనసున్న మారాజు

- వెండి తెరపై రెబల్‌స్టార్ కృష్ణంరాజు
- ఎంపీగా, కేంద్ర మంత్రిగా జిల్లా అభివృద్ధిపై ముద్ర
- నేడు జయంతి.. మొగల్తూరులో మెగా వైద్య శిబిరం
- మ్యూజియం, స్మృతివనం ఏర్పాటుకు మంత్రుల హామీ
- ఏడాదిన్నరైనా ఆ దిశగా పడని అడుగులు

మొగల్తూరు, జనవరి 19 : మొగల్తూరు ముద్దు బిడ్డ.. రెబల్‌స్టార్ కృష్ణంరాజు. మనసున్న మారాజుగా కీర్తిగడించారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన ఉప్పలపాటి నారాయణమూర్తిరాజు లక్ష్మీదేవమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఆరుగురు కుమార్తెలు. మూడో సంతానంగా కృష్ణంరాజు 1940 జనవరి 20న మొగల్తూరులో జన్మించారు. విద్యాభ్యాసం మొగల్తూరు, నరసాపురం, హైదరాబాద్‌లో జరిగింది. రోడ్డు ప్రమాదంలో మొదటి భార్య మృతితో 1996లో శ్యామలాదేవిని రెండో వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. మాజీ మంత్రి గాంధేయవాది, సీహెచ్‌వీపీ మూర్తిరాజు ద్వారా 1968లో సినీ రంగంలోకి అడుగుపెట్టారు. అంచలంచెలుగా ఎదిగి 183 సినిమాల్లో హీరోగా, విలన్‌గా విభిన్న పాత్రలు పోషించి మెప్పించారు. కృష్ణంరాజు తొలుత కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లో వచ్చినప్పటికీ 1996 ప్రాంతంలోనే బీజేపీలో చేరారు. 1998 కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. 1999 నర్సాపురం పార్లమెంట్ స్థానం నుంచి లక్షా 50 వేలపైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించడంతో కేంద్ర మంత్రి పదవి వరించింది. ఐదేళ్లలో ఆయన పరిశ్రమలు, విదేశీ వ్యవహారాలు, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా పనిచేశారు. కృష్ణంరాజుకు మొగల్తూరు అంటే ఎంతో మమకారం. ఈ ప్రాంత ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకునేవారు. 1986 వరదలు, ఇతర విపత్తు సమయాల్లో ప్రజలకు సహాయం చేసి స్వగ్రామంపై తన అభిమానాన్ని చాటుకున్నారు. నియోజకవర్గంలో ప్రతీ గ్రామానికి కేంద్ర గ్రామీణ సడక్ యోజన పేరుతో సిమెంట్ రోడ్లు నిర్మించారు. 2004 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా నరసాపురం నుంచి ఓటమి చెందారు. 2009లో ప్రజారాజ్యంలో చేరి, రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తర్వాత కాలంలో తనను రాజకీయంగా నిలబెట్టి కేంద్ర మంత్రి పదవి కూడా ఇచ్చి గౌరవించిన బీజేపీతో చివరి వరకు కొనసాగారు. 2022 సెప్టెంబరు 11న 82వ ఏట అనారోగ్యంతో కన్నుమూశారు.

ఏడాదిన్నరైనా కనిపించని స్మృతివనం

మొగల్తూరులో 2022 సెప్టెంబర్ 29న రాష్ట్ర ప్రభుత్వం కృష్ణంరాజు సంస్మరణ సభను ఏర్పాటు చేసింది. ఆ సమయంలో 'కృష్ణంరాజు పేరిట పేరుపాలెం తీరంలో రెండు ఎకరాల భూమిలో మ్యూజియం ఏర్పాటు చేస్తాం. మొగల్తూరులో ఒక పంచాయతీ చెరువును వాకింగ్ ట్రాక్‌గా మార్చి స్మృతి వనం నిర్మిస్తాం' అంటూ మంత్రులు ఆర్‌కే రోజా, కారుమూరి నాగేశ్వరరావు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, చీఫ్ విప్ ప్రసాదరాజు ప్రకటించారు. ఇది జరిగి ఏడాదిన్నర అవుతోంది. కాని, ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం హామీలను నెరవేర్చలేదు. కృష్ణంరాజుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా ? అని అభిమానులు, గ్రామ ప్రజలు మండిపడుతున్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

కృష్ణంరాజు జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు మొగల్తూరు అబ్యాస్ కళాశాలలో శనివారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, కుమార్తెసాయి ప్రసిద్ద రెండు రోజులుగా మొగల్తూరులోనే ఉన్నారు. ఈ క్రమంలో స్థానికులు, అభిమానులు శ్యామలాదేవిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తు చేస్తున్నారు. దేశ, విదేశాలకు చెందిన 30 మంది ప్రముఖ వైద్యులతో నిర్వహించే వైద్య శిబిరానికి మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వానికి అంబేడ్కర్‌పై చిత్తశుద్ధి లేదు

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసవర్మ విమర్శ




మాట్లాడుతున్న శ్రీనివాసవర్మ

కాళ్ళ, జనవరి 19 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తామని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వానికి అంబేడ్కర్‌పై చిత్తశుద్ధి లేదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ విమర్శించారు. కాళ్ళ మండలం దొడ్డనపూడి, కాళ్ళకూరు, బొండాడ, ఎస్సీ బోస్‌కాలనీ గ్రామాల్లో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులతో కలిసి శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కాళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే మీ పేరు పెట్టుకున్న విద్యా పథకానికి గతంలో ఉన్న అంబేడ్కర్ పేరే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

22న స్కూళ్లకు సెలవు ప్రకటించాలి

అయోధ్య రాముని ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా దేశంలోని అన్ని రాష్ట్రాలు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించినా ఏపీలో మాత్రం 22న పాఠశాలలు పునః ప్రారంభించడం దారుణమన్నారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు విద్యార్థులను తరలించాలని ఉద్దేశంతో సెలవులు పొడిగించినట్టే అయోధ్య రాముడి ప్రతిష్ఠ రోజున కూడా సెలవు ప్రకటించాలని బీజేపీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. బీజేపీఉండి ఇన్‌చార్జి కోరా రామ్మూర్తి, ఎస్.కాశీవిశేశ్వరరావు పాల్గొన్నారు.

అయోధ్యకు అనఘానంద భారతి స్వామిజీకి ఆహ్వానం



ఆహ్వాన పత్రిక చూపుతున్న అనఘానంద భారతి స్వామీజీ

జీలుగుమిల్లి, జనవరి 19 : కామయ్యపాలెం దత్త సాయి ఆశ్రమ వ్యవస్థాపకుడు శ్రీఅనఘానంద భారతి స్వామిజీకి అయోధ్య నుంచి ఆహ్వానం అందింది. అయోధ్యలో ఈనెల 22న జరిగే బాలరాముని విగ్రహ ప్రతిష్ఠకు రావాలని ఆలయ ట్రస్ట్ నుంచి వచ్చిన ఆహ్వానం మేరకు ఆయన వెళ్లారు. దేశ వ్యాప్తంగా నాలుగు వేల మంది స్వామీజీలకు వచ్చిన ప్రత్యేక ఆహ్వానంలో జీలుగుమిల్లి మండలానికి చెందిన ఈయన ఒకరిగా నిలిచారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో షిర్డీలో మొట్టమొదటి సారిగా జరిగే అంతర్జాతీయ తెలుగు సాయి భక్త సమ్మేళనంలో పాల్గొని, అక్కడ కార్యక్రమాల్లో న్యాయ నిర్ణేతగా, వక్తగా ప్రసంగించేందుకు ఆహ్వానం అందుకున్నారు. అయోధ్యలో జరిగే కార్యక్రమం అనంతరం షిర్డీ వెళ్లనున్నట్టు తెలిపారు.



యోగి వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉద్యాన వర్సిటీలో వేమన జయంతి వేడుకలు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 19: వెంకట్రామన్న గూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఆవరణలోని కళాశాల ప్రాంగణంలో శుక్రవారం మహాకవి, సంఘ సంస్కర్త యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించారు. వేమన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ ఎస్. సూర్య కుమారి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డి.వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

ఏలూరు క్రైం, జనవరి 19 : ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో పేకాటాడుతున్న ఇద్దరిని ఎస్‌ఈబీ సిబ్బంది అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6,010 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని ఏలూరు రూరల్ పోలీసులకు అప్పగించారు. రూరల్ పోలీసులు వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో పేకాట ఆడుతున్న అరుగురిని ఎస్ఐ మదీనాబాషా అరెస్టు చేసి వారి నుంచి రూ.4,750 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





ఏలూరు కొత్త బస్టాండ్, పాత బస్టాండ్‌ల వద్ద బస్సులు రాగానే ఎక్కేందుకు పరుగులు తీస్తున్న ప్రయాణికులు

బస్సులన్నీ సీఎం సభకే..



బస్సు సీటు కోసం ప్రయత్నిస్తున్న యువతి

విజయవాడకు తరలివెళ్లిన ఆర్టీసీ బస్సులు

- అన్ని రూట్లలో కిక్కిరిసిన ప్రయాణాలు
- పండగ సమయాల్లో ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

విజయవాడలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణతోపాటు, అనంతరం సీఎం భారీ సభ ఏర్పాటు చేయడంతో ఉమ్మడి పశ్చిమ జిల్లాలో అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సులను సభకు తరలించడంతో శుక్రవారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏ డిపోనుంచి ఎన్ని బస్సులు సీఎం సభకు తీసుకువెళ్లాలో ముందుగానే నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోలనుంచి 100 బస్సులను, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 107 ఆర్టీసీ బస్సుల్లో జనాన్ని తరలించారు. మిగిలిన బస్సులను రద్దీ రూట్లలో నడిపి కొంతలో కొంతైనా సర్వీస్ ఇవ్వాలని అధికారులు భావించారు. కానీ బస్సులు చాలకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడాల్సివచ్చింది. చాలామంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.

- ఏలూరు రూరల్/జంగారెడ్డిగూడెం/ భీమవరంటౌన్

విజయవాడలో సీఎం సభకు కార్యకర్తలను తరలించేందుకు ఆర్టీసీతో పాటు ప్రైవేట్ కళాశాల బస్సులను వైసీపీ నేతలు ఏర్పాటు చేశారు. జనసమీకరణకు ఏలూరు జిల్లాలోని మూడు డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు కేటాయించారు. దీంతో సరిపడా బస్సులు లేక ఉన్నబస్సుల్లో తమ గమ్యస్థానాలు చేరుకునేందుకు ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. తక్కువగా ఉండే రూట్లలో సర్వీసులను తగ్గించారు. ఆయా రూట్లలో ప్రయాణికులు ఏలూరు బస్టాండ్‌లో గంటలకొద్దీ ఎదురుచూడాల్సి వచ్చింది. ఏలూరు బస్టాండ్ నుంచి దాదాపు 50 వేల నుంచి 60వేల మంది ప్రయాణికులు పలు రూట్లలో ప్రయాణం చేస్తుంటారు. ప్రయాణికుల అవసరాలను పూర్తిగా తీర్చలేకే ఆర్టీసీ అద్దెబస్సులు నడుపు తోంది. గమ్యస్థానాలకు చేరుకునేందుకు వృద్ధులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. కొత్త బస్టాండ్‌లో రద్దీగా ఉండడంతో బస్సులకోసం ఎగబడాల్సి వచ్చింది. చాలా సేపు వేచిఉన్న బస్సుల్లో సీట్లు దొరక్కపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. ప్రైవేట్ వాహనాలు అదనంగా చార్జీలు పెంచి వసూలు చేశారు. ఇప్పటికే సంక్రాంతి ప్రత్యేక బస్సులు మాటచెప్పి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో ఆర్టీసీకి అదనపు ఆదాయం చేకూరలేదు.



భీమవరం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో వేచివున్న ప్రయాణికులు

గంటసేపటికీ బస్సు రాలేదు

చింతలపూడి నుంచి ఏలూరు వచ్చా. పని పూర్తయ్యాక తిరిగివెళదామంటే ఒక్క బస్సుకూడా లేదు. గంటసేపు ఎదురుచూశా. ఇక్కడ ఉన్న అధికారులను ఏది అడిగినా సమాచారం చెప్పడం లేదు. బస్సు వస్తుంది వస్తుంది అంటున్నారేగాని గంటసేపు వేచి వున్నా బస్సు రాలేదు.

- సుబ్రహ్మణ్యం,చింతలపూడి

ప్రజలను ఇబ్బంది పెడతారా?

సొంత పనిమీద ఏలూరు వచ్చా.. అక్కడి నుంచి తిరిగి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వచ్చిన బస్సులో ప్రయాణికులు చాలా ఎక్కువగా ఉన్నారు. తరువాత బస్సుకు వెళదామంటే ఒక్కబస్సు కూడా రాలేదు. సీఎం సభకు బస్సులు తీసుకుని ప్రజలను ఇబ్బంది పెట్టడం తగదు.

- లక్ష్మణరావు, ఉంగుటూరు

సగం బస్సులు విజయవాడకే..

జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో నుంచి సగం బస్సులను విజయవాడ సీఎం సభకే కేటాయించారు. మిగిలిన వాటితో కొన్ని సర్వీసులను కుదించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పండుగ సమయం కావడంతో సొంత గ్రామాలకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మూడు రోజులుగా ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడాయి. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలో మొత్తం 68 బస్సులు ఉన్నాయి. కాగా చింతలపూడి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి శుక్రవారం ఉదయం జనాన్ని తరలించడానికి 33 బస్సులను కేటాయించారు. జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంకు పన్నెండు బస్సులు చింతలపూడి మండలానికి ఏడు బస్సులు, కామవరపుకోట మండలానికి 7 బస్సులు, లింగపాలెం మండలానికి 7 బస్సులు మాత్రమే కేటాయించారు.

భీమవరం బస్‌కాంప్లెక్స్ కిటకిట

పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 107 ఆర్టీసీ బస్సుల్లో సీఎం సభకు జనాన్ని తరలించడానికి ఉపయోగించడంతో జిల్లాలోని పలు ప్రాంతాలకు బస్సు సౌకర్యం అందక ప్రయాణికులు ఇబ్బందులు గురయ్యారు. ఉదయం నుంచి బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను, ఆటోలను పట్టుకుని ప్రయాణాలు కొనసాగించారు. కాంప్లెక్స్‌కు బస్సు వచ్చిందంటే చాలు ప్రయాణికులు ఎక్కేందుకు ఆపసోపాలు పడ్డారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కూడా తగ్గాయని ప్రయాణికులు వాపోయారు. అధికారులు ముందస్తు సమాచారం అందించకపోవడంతో ప్రయాణికులు అగచాట్లు పడ్డారు. జిల్లాలోని భీమవరం డిపో నుంచి 32 బస్సులు, తాడేపల్లిగూడెం డిపో నుంచి 22 బస్సులు, తణుకు డిపోనుంచి 31 బస్సులు, నరసాపురం డిపో నుంచి 22 బస్సులను విజయవాడకు పంపించారు.

రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల విజేత 'కృష్ణా జిల్లా'



ట్రోఫీ అందుకుంటున్న కృష్ణా జిల్లా జట్టు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 19: ఉప్పరగూడెంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల్లో కృష్ణా జిల్లా జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం హోరాహోరీగా జరిగిన పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా ఉప్పరగూడెం-1 జట్టుపై విజయం సాధించింది. విజేత కృష్ణా జిల్లా జట్టుకు రూ.30 వేల నగదు, బహుమతి ట్రోఫీ, రన్నర్‌కు రూ.25 వేల నగదు బహుమతి అందించారు. మూడో స్థానంలో నిలిచిన ఉప్పరగూడెం-2 జట్టుకు రూ.15వేల నగదు బహుమతి, నాలుగో స్థానంలో నిలిచిన నెల్లూరు జట్టుకు రూ.10వేలు, బెస్ట్ టీంగా నిలిచిన భీమవరం జట్టుకు రూ.5 వేలు నగదు బహుమతులు అందించారు.

సౌత్‌జోన్ చెస్ పోటీలకు నవీన్ ఎంపిక



విద్యార్థి నవీన్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ మోజెస్

పెదవేగి, జనవరి 19 : దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో మూడో ఏడాది దంతవైద్య విద్య అభ్యసిస్తున్న సీహెచ్.నవీన్ సౌత్‌జోన్ చెస్ పోటీలకు ఎంపికయ్యాడని కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ ఈ.త్రిమూర్తి ఆధ్వర్యంలో పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కళాశాలలో ఈనెల 18న నిర్వహించిన సౌత్‌జోన్ చెస్ ఎంపిక పోటీల్లో ఎంపికయ్యాడన్నారు. ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు తిరుచురాపల్లి భారతీయ దాస్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ చెస్ పోటీల్లో నవీన్ పాల్గొంటాడన్నారు. విద్యార్థినిని కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.స్లీవరాజు, పీడీ ఎన్.నల్లయ్య అభినందించారు.

క్రైం కార్నర్

అప్పుల భారంతో కౌలు రైతు ఆత్మహత్య



గోపీకృష్ణ మృతదేహం

పోలవరం, జనవరి 19: అప్పుల భారంతో పురుగుమందు తాగి కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలవరం పంచాయతీ నూతనగూడెంకు చెందిన తిరుమలశెట్టి గోపీకృష్ణ (50) పోలవరంలో మూడు ఎకరాల పొలం కౌలుకు సాగు చేస్తున్నాడు. మూడేళ్లుగా వ్యవసాయంలో నష్టం రావడం, ఇటీవల తుఫాన్‌కు పంట కోల్పోవడంతో రూ.7 లక్షల వరకూ అప్పులు చేశాడు. అప్పులకు వడ్డీలు కట్టలేక కొద్ది రోజులుగా ఇబ్బందిపడుతున్న అతడు శుక్రవారం పొలంలోనే పురుగు మందు తాగాడు. గమనించిన స్థానికులు అతడిని రాజమహేంద్రవరం అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మరొక చోటికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అతడి భార్య సత్యవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

వీరవాసరం, జనవరి19 : మెంటేపూడిలో భూమిని దమ్ము చేస్తున్న ట్రాక్టర్ బోల్తా పడి ఓ యువకుడు మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ కొల్లా శివశంకర్ (26) మరణించాడు. శుక్రవారం మెంటేపూడిలోనే పంటచేలు దమ్ము చేయటానికి వెళ్ళి దమ్ము చేస్తుంగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. మట్టిలో పడిన శివశంకర్ అపస్మారక స్థితికి వెళ్లాడని స్థానికులు చెబుతున్నారు. దీనిని గుర్తించి రైతులు హుటాహుటిన వీరవాసరం పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందాడని పీహెచ్‌సీ సిబ్బంది తెలిపారు.

ఆరుగురి దాడి.. కేసు నమోదు

ఆకివీడు, జనవరి 19: పాత కక్షల నేపథ్యంలో జరిగిన కొట్లాటలో ఓ వ్యక్తి గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. పెదకాపవరం శివారు గొల్లగూడెంకు చెందిన నిలపాల శ్రీనివాసరావును గంగుల సుబ్బారావు, సాయిప్రకాశ్, రామకృష్ణలతో పాటు మరో ముగ్గురు గురువారం రాత్రి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాడు. మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు తరలించగా శుక్రవారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తల్లీకూతుళ్లపై దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

ఉండి, జనవరి 19: ఓ విద్యార్థిని ప్రేమించలేదనే కారణంతో కొడవలితో తల్లీకూతుళ్లపై దాడి చేసి గాయపరిచిన కొణతం వెంకట కేశవ సుబ్రహ్మణ్యంను ఉండి పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం ఉండి ఇన్‌చార్జి ఎస్ఐ వీరభద్రరావు, ఏఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ తెలిపిన వివరాలివి.. ఉప్పులూరుకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని తనను ప్రేమించలేదనే కారణంతో సంక్రాంత్రి పండుగరోజున కొడవలితో తల్లీకూతుళ్లపై దాడి చేసి గాయపరిచిన విషయం విదితమే. ఈ కేసుకు సంబంధించి వెంకట కేశవ సుబ్రహ్మణ్యంను అరెస్ట్ చేసి భీమవరం కోర్టుకు తరలించినట్టు తెలిపారు. భీమవరంలోని రెండో అదనపు ఫస్ట్ మేజిస్ట్రేట్ వారు సుబ్రహ్మణ్యంకు రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు.

3,930 కేజీల రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యం వ్యానుతో అధికారులు

భీమడోలు, జనవరి 19 : ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా వ్యాన్‌లో రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని భీమడోలు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ శుక్రవారం పట్టుకున్నారు. చల్లచింతలపూడి, పంగిడిగూడెం గ్రామాల నుంచి సేకరించి వ్యానులో రాజమహేంద్రవరానికి తరలిస్తున్న రేషన్ బియ్యం లోడు వ్యానును అధికారులు స్వాధీన పర్చుకున్నారు. 3,930 కేజీల బియ్యాన్ని 64 బస్తాల్లో తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. బియ్యానికి సంబంధించిన యజమాని నీలాల భవానీప్రసాద్, డ్రైవర్‌లపై కేసు నమోదు చేశామని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

బాలికపై అత్యాచారం.. పదేళ్ల జైలు శిక్ష

ఏలూరు క్రైం, జనవరి 19 : ఆడుకుంటున్న బాలికను డాబాపైకి తీసుకువెళ్ళి అత్యాచారానికి పాల్పడిన ఓ యువకుడిపై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్ష, ఐదు వేల రూపాయలు జరిమానా విధిస్తూ ఏలూరు పోక్సో స్పెషల్ కోర్టు న్యాయాధికారి ఎస్.ఉమాసునంద శుక్రవారం తీర్పు వెల్లడించారు. ఉంగుటూరులోని సుబ్బారాయుడుపేటకు చెందిన ఈదుపల్లి వెంకట దుర్గాసాయి(సాయి) (20) ఆ గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని పరిచయం చేసుకుని ఫ్యాక్టరీలో ఉద్యోగం పొందాడు. అతడి ప్రవర్తన సరిగా లేకపోవడంతో ఉద్యోగం నుంచి తొలగించారు. అప్పటినుంచి తరచుగా ఆ వ్యక్తి ఇంటికి వెళ్తున్నాడు. 2018 ఆగస్టు 28వ తేదీ సాయంత్రం సమయంలో ఇంటి వద్ద ఎవరూ లేకుండా బాలిక ఆడుకుంటుంది. ఆ బాలికను డాబాపైకి తీసుకువెళ్ళి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన బాలిక తల్లి కేకలు వేయడంతో సాయి పారిపోయాడు. ఈ ఘటనపై బాధితురాలు చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ నాగ వెంకటరాజు కేసు నమోదు చేశారు. ఈ కేసు ఏలూరు పోక్సో స్పెషల్ కోర్టులో విచారణ సాగింది. నిందితుడైన ఈదుపల్లి వెంకట దుర్గాసాయిపై నేరం రుజువుకావడంతో పదేళ్ల జైలు శిక్ష, ఐదు వేల రూపాయలు జరిమా నా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసుకు సహకరించిన నిడమర్రు సీఐ ఎం.సుభాష్, చేబ్రోలు ఎస్ఐ మణికుమార్, కోర్టు హెచ్‌సీ బి.ప్రసాద్‌తో పాటు జిల్లా కోర్టు మానిటరింగ్ సెల్ వారిని ఎస్పీ అభినందించారు.

యువకుడిపై పోక్సో కేసు

ఒక విద్యార్థినికి స్నేహితుడైన యువకుడు ఆమె ఫొటోలను అసభ్యకరంగా మార్చి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానని బెదిరించడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీటౌన్ ఎస్ఐ మదీనాబాషా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన యువతి(16)కు గతంలో ఏలూరులో చదివిన సమయంలో ఇరువాడ ఆనంద్ అనే యువకుడు స్నేహితుడు. అప్పట్లో వీరు ఒకరి ఫొటోలు ఒకరు వాట్సాప్ ద్వారా పంపుకున్నారు. ఆ తరువాత ఆ యువతి విశాఖపట్టణం ఉన్నత చదువులకు వెళ్లింది. ఇటీవల పండుగ సందర్భంగా ఏలూరు రావడంతో ఆమెతో మాట్లాడాలని ఏలూరు మినీ బైపాస్ రోడ్డు వద్దకు వచ్చి తాను చెప్పినట్లు చేయకపోతే ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానని బెదిరించాడు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మదీనాబాషా తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

విశాఖపట్నం(లీగల్), జనవరి 19: వృద్ధురాలిని కిరాతకంగా హత్యచేసి, బంగారు ఆభరణాలు దొంగిలించిన నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ విశాఖ ఆరో అదనపు జిల్లా జడ్జి లాలం శ్రీధర్ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ గ్రంధి శ్రీనివాస్ తెలిపిన వివరాలివి.. ఏలూరుకు చెందిన గొల్లపల్లి నాగమల్లేశ్వరరావు(28)కు దొంగతనాలు చేయడం అలవాటు. దీనిలో భాగంగా 2014 జూలై 11న నగరంలోని ఆరిలోవలో నివశిస్తున్న వెదురుపాకల నూకాలమ్మ(65) ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు కాజేయాలని నిర్ణయించుకున్నాడు. ఎవరూలేని సమయంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఆమె ఇంట్లోకి వెళ్లి నూకాలమ్మ పీకనొక్కి చంపి, ఆభరణాలు తస్కరించాడు. ఇంటికి వచ్చిన మృతురాలి కుమారుడు సూర్యనారాయణ జరిగిన ఘటనపై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడ్ని అరెస్టుచేసి, ఆభరణాలు స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువుకావడంతో న్యాయాధికారి యావజ్జీవ కారాగార శిక్ష, రూ. రెండు వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

రెస్టారెంట్‌లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

జంగారెడ్డిగూడెం, జనవరి 19 :జంగారెడ్డిగూడెంలోని రెస్టారెంట్‌పై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని తినేర మల్టీ క్యూజిన్ రెస్టారెంట్‌లో కృత్రిమ రంగులు కలుపుతున్నారని వచ్చిన సమాచారంతో విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు, ఆహార పదార్థాల తనిఖీ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులు కలిపినట్టుగా వచ్చిన అనుమానంతో నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఈ తనిఖీల్లో వంద గ్రాముల తూకం గల 15 రకాల కృత్రిమ రంగుల డబ్బాలను గుర్తించి వాటిని ధ్వంసం చేశారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ విల్సన్, లీగల్ మెట్రాలజీ, ఆహార పదార్థాల తనిఖీ అధికారులు పాల్గొన్నారు.

జన్మభూమికి ఏదో చేయాలనే తపన

- ఇప్పటికి 11 చిత్రాలు పూర్తి చేశా : దర్శకుడు రాజా వన్నెంరెడ్డి



ఉండి, జనవరి 19:'జన్మభూమికి ఏదో చేయాలనే తపనతోనే ప్రతి ఏటా స్వగ్రామం చిలుకూరు వచ్చి అమ్మవార్లను దర్శించుకుంటా. ఆడపడుచుగా పిలుచుకునే పైడమ్మ ఆలయాన్ని తానే నిర్మించా.. అమ్మవారి ఆశీర్వాదాలతోనే సినిమాల షూటింగ్ చేపడతా' అని దర్శకుడు రాజా వన్నెంరెడ్డి అన్నారు. శుక్రవారం చిలుకూరులో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు తీసిన పదకొండు చిత్రాల్లో పలు చిత్రాలు సూపర్ హిట్‌గా నిలిచాయి. 1986లో ఇండస్ట్రీకి వెళ్లాను, తనకు ఎంతోమంది సహకారం అందించారు. క్షేమంగా వెళ్లి లాభంగా రండి, చూసొద్దాం రండీ, అక్కాబావెక్కడ, మీఇంటికి వస్తే ఏమిస్తారు మా ఇంటికి వస్తే ఏంతెస్తారు, ఆదివారం ఆడవాళ్లకు సెలవు, మా ఆయన చంటిపిల్లోడు, దొంగ చచ్చినోళ్లు, తెలుగు అమ్మాయి, లవ్ డాట్ కమ్, టామీ, ప్రశ్నిస్తా ! తదితర సినిమాలు తీశానన్నారు. మార్చి నెలలో ఒక సినిమా తీస్తున్నాను. అంతా కొత్త వాళ్లతో మంచి ట్రెండ్ కలిగిన సినిమాను తీస్తున్నానన్నారు. ఏప్రిల్ నుంచి పరమానందయ్య శిష్యుల కథ వెబ్ సిరీస్ ప్లస్ తీస్తున్నానన్నారు.

సామాజిక స్పృహ పెంచేలా సినిమాలు తీస్తా

- సినీ దర్శకుడు తేజ మార్ని



లలితా రాజరాజేశ్వరి దేవి పీఠాన్ని దర్శించుకున్న దర్శకుడు తేజ

తణుకు, జనవరి19 : సామాజిక స్పృహ పెంపొందించే చిత్రాలు తీయాలని అనుకుంటున్నట్టు సినీ దర్శకుడు తేజ మార్ని తెలిపారు. శుక్రవారం పైడిపర్రులోని శ్రీలలితా రాజరాజేశ్వరి అమ్మవారి పీఠాన్ని దర్శించుకున్నారు. అమ్మవారి దేవి ఉపాసకులు పొన్నపోలు సుధీర్‌శర్మ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మం పట్ల యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. జోహార్, అర్జున ఫాల్గుణ చిత్రాలతో పాటు కోట బొమ్మాళి పీఎస్ చిత్రంద్వారా విజయం అందిపుచ్చుకున్నట్టు తెలిపారు. త్వరలోనే పెద్ద హీరోతో చిత్రం చేస్తామని, ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, వాటి వివరాలు త్వరలోనే వెల్లడిస్తానన్నారు.



ఏలూరులో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వివేక్‌ఠాకూర్


కేంద్ర పథకాల అమల్లో ఏలూరు జిల్లా భేష్

- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ వివేక్‌ఠాకూర్

ఏలూరు కలెక్టరేట్/లింగపాలెం, జనవరి 19: కేంద్ర ప్రభుత్వ పథకాల అమల్లో, వికసిత్ భారత్ సంకల్ప కార్యక్రమ నిర్వహణలో ఏలూరు జిల్లా పనితీరు బేషుగ్గా ఉందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ వివేక్‌ఠాకూర్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం భారత్ సంకల్పయాత్ర, కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కార్యక్రమాల అమలు తీరును కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్, జేసీ లావణ్యవేణి, అధికారులతో ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల కోసం కేంద్రం అనేక సంక్షేమపథకాలు ప్రవేశపెట్టిందని అందరికి అన్ని పథకాలు లబ్ధిచేకూరేలా వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అర్హుల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరగకూడదన్నారు. జిల్లాలో కార్యక్రమం చేపట్టకముందు, తరువాత సంబంధిత అంశాల్లో ప్రగతితీరును నివేదిక అందజేయాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న 17 ప్రధాన పథకాల ప్రగతిని వివరించారు. సమావేశంలో జడ్పీ సీఈవో సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, డీఈవో శ్యామ్‌సుందర్, అధికారులు పాల్గొన్నారు.

- లింగపాలెం మండలం బోగోలు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంతో పాటు పలు విషయాల్లో ఆధునిక పరిజ్ఞానంతో ముందుకు వెళ్లాలన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష్‌రాజేంద్రన్, సర్పంచ్ తాడేపల్లి శాంతారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు జానల పుంగనూరు చిట్టి ఆవు



పెనుమంట్ర, జనవరి 19 : పాడిపంటలతో పాటు పశువుల పెంపకంపై ఆసక్తి గల మార్టేరుకు చెందిన సత్తి వెంకటరెడ్డి పుంగనూరు ఆవులు పెంచుతునానడు. పుంగనూరు ఆవు సూడిది కావడంతో రెండు రోజుల క్రితం చిట్టి పుంగనూరు ఆవు జన్మించింది మూడు జానల ఎత్తు కలిగిన పుంగనూరు చిట్టి ఆవును చూసేందుకు గ్రామానికి చెందిన సత్తి వెంకటరెడ్డి పశువుల పాక జగన్నాథపురం ఆయకట్టు పరిధిలో ఉంది. అక్కడకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఆవుతో పలువురు సెల్ఫీలు దిగుతున్నారు. ఈ పశువుల పాకలో ఆవులతో పాటు పుంగనూరు ఆవు, కపిలి ఆవును పెంచుతున్నాడు. ఈ ఆవులను చూసి పశుప్రేమికులు ఎంతగానో మురిసిపోతున్నారు.

మా డబ్బులు చెల్లించండి మహోప్రభో..



జంగారెడ్డిగూడెం హైస్కూల్ వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

ఉపాధ్యాయులు, ఉద్యోగుల నిరసన

జంగారెడ్డిగూడెం, జనవరి 19: తమ డబ్బు తీసుకోవడానికి వినతులు, ఉద్యమాలు, నిరసన దీక్షలు చేయాల్సిరావడం దారుణమని యుటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎంవీ శ్యాంబాబు అన్నారు. యూటీఎఫ్ పిలుపులో భాగంగా జంగారెడ్డిగూడెం బాలుర ఉన్నత పాఠశాల వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరితో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ, అడ్వాన్స్‌ల కోసం, డీఏ బకాయిల కోసం యూటీఎఫ్ పోరాటం కొనసాగుతుందన్నారు. జిల్లా ఆడిట్ సభ్యుడు ఎంఏ నబీ మాట్లాడుతూ ఉద్యమాలు చేయకుంటే మొండి ప్రభుత్వం వినదన్నారు. జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు, పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని ఇంటికి పంపిస్తాం..



కొవ్వలిలో పాదయాత్ర చేస్తున్న చింతమనేని, అశోక్ కుమార్

ఇచ్ఛాపురం నుంచి తిరుమలకు పాదయాత్ర

దెందులూరు, జనవరి 19: ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని ఇంటికి పంపించేందుకు ఆయన చెల్లి షర్మిలతో పాటు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోరుతూ టీడీపీ నేత అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం నుంచి తిరుమలకు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం దెందులూరు నియోజకవర్గంలోని గుండుగొలను, సింగవరం, కొవ్వలి చేరుకుంది. చింతమనేని ప్రభాకర్, మాగంటి మిల్లుబాబు, కసూకుర్తి రామకృష్ణ పలువురు టీడీపీ నేతలు స్వాగతం పలికారు. పాలగూడెం, సోమవరప్పాడు, వంగూరు, దుగ్గిరాల, వట్లూరు, అప్పనవీడు, హనుమన్ జంక్షన్ మీదుగా అశోక్ కుమార్‌తో కలిసి చింతమనేని, నేతలు పాదయాత్ర చేశారు.

ఆరోగ్యమే మహా భాగ్యం..



భీమడోలు సర్పంచ్‌ను సత్కరించిన పంచాయతీరాజ్ అధికారులు

ఆరోగ్య గ్రామంగా భీమడోలు

ఏలూరు సిటీ, జనవరి 19: తిరుపతిలో జరిగిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి వర్క్‌షాప్‌లో భీమడోలు పంచాయతీ ఆరోగ్యవంతమైన గ్రామం అంశంలో అందరినీ ఆకట్టుకుంది. మూడు రోజుల సదస్సులో డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ బృందం భీమడోలు సర్పంచ్ సునీత మాన్‌సింగ్ చేస్తున్న కార్యక్రమాలపై లఘు చిత్రం ప్రదర్శించింది. దేశం నలుమూలలు నుంచి వచ్చిన డెలిగేట్స్, అధికారులు, సర్పంచ్‌లు ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై అమలు చేస్తున్న ఉత్తమ పద్ధతులను చర్చించారు. సర్పంచ్ సునీత మాన్‌సింగ్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి స్పెషల్ చీఫ్ సెక్రటరి రాజశేఖర్, పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి, హాజరైన ప్రతినిధులు సత్కరించారు.

చదరంగంలో తల్లీ కొడుకుల ప్రతిభ



రాష్ట్రస్థాయి పతకాలు సాధించిన తల్లీ కొడుకులు

రాష్ట్ర స్థాయిలో ప్రథమ, తృతీయ పతకాలు

ఏలూరు స్పోర్ట్స్, జనవరి 19: విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్‌లో ఏలూరుకు చెందిన తల్లీ కొడుకులు ప్రథమ, తృతీయ పతకాలు సాధించారు. అబ్రహం, గ్యారీ కాస్ప్రో చెస్ అకాడమీకి చెందిన జి.అరుణకుమారి మహిళల విభాగంలో ప్రథమస్థానం సాధించగా, ఆమె కుమారుడు గంజి అభిషేక్ అండర్ -11 విభాగంలో మూడోస్థానం సాధించాడు. అనురూప్ మోషే అండర్-19 విభాగంలో మూడోస్థానం సాధించారు. తల్లితో పాటు కొడుకు చదరంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. వారు రాష్ట్రస్థాయిలో ప్రథమ, తృతీయ స్థానాలు సాధించడంపై అకాడమీ డైరెక్టర్ జి.యోహానంద్, పలువురు చదరంగం క్రీడాకారులు అభినందించారు. మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.



జయహో బీసీ సభలో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

జగన్ పాలనలో బీసీలకు అన్యాయం

చింతలపూడి, జనవరి 19: జగన్ పాలనలో బీసీలకు అన్యాయం చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. రాఘవాపురంలో శుక్రవారం జరిగిన జయహో బీసీ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టీడీపీ, జనసేన విజయానికి కీలక పాత్ర వహించేది బీసీలేనన్నారు. తెలుగుదేశం పార్టీకి వెన్నుముక బీసీలేనని, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశంను అధికారంలోకి తీసుకువచ్చే బాధ్యత బీసీలదేనన్నారు. పరిపాలన చేతకాని సీఎంను ఓడించాలన్నారు. పలువురు బీసీ నాయకులు మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసినా నిధులు ఇవ్వలేదని, చేతివృత్తి పరికరాలుగాని ఎటువంటి సాయం చేయలేదన్నారు. గతంలో ఉన్న పథకాలను మూలనపడేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే లు చింతమనేని ప్రభాకర్, ఘంటా మురళీరామకృష్ణ, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కోళ్ళ నాగేశ్వరరావు మాట్లాడారు. బీసీ నాయకులు దాసరి చంద్రశేఖ, శ్రీనివాస చక్రవర్తి, కొండపల్లి రవి, మిద్దే సత్యనారాయణ, చిట్టుబోయిన రామలింగేశ్వరరావు, రాజన పండు, కొప్పెర్ల నాగరాజు, సాయల సత్యనారాయణ, చిన్నం వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు చీదరాల మధుబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాఘవాపురంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కోడి కత్తి శ్రీను కుటుంబం నిరాహార దీక్షకు టీడీపీ, జనసేన సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు గన్ని వీరాంజనేయులు ప్రకటించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నిర్మూలన సాధ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 19: ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నిర్మూలన సాధ్యమని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పవర్‌పేట, పాండురంగాపురం అర్బన్ పీహెచ్‌సీల పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గోవిందరావు మాట్లాడుతూ దోమలు ప్రాణంతక డెంగీ, చికున్ గున్యా, మలేరియా, మెదడువాపు తదితర వ్యాధులకు కారకాలన్నారు. నీటి నిల్వ ప్రాంతాలను వారానికి ఒకటి, రెండు సార్లు శుభ్రం చేసుకోవాలన్నారు. డాక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జ్వరంవస్తే అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. వైద్యసిబ్బంది ఝాన్సీ, అచ్చాయమ్మ, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, ప్రియాంక, విజయ, అరుణ, సునీత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: చేబ్రోలు, కాగుపాడు పీహెచ్‌సీ పరిధిలో మలేరియా యూనిట్ ఉప ఆరోగ్య అధికారి వై.వీ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. వారానికి ఒకసారి ఫీవర్ సర్వే నిర్వహించి ఇంటి పరిసరాల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి కె.శ్రీనివాసరావు, ఎస్తేరు, రమాదేవి, శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతాంగ వ్యతిరేక విధానాల పై పోరాటం



సమావేశంలో రైతు సంఘ నాయకులు

ఏలూరు టూటౌన్, జనవరి 19: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాల పై పోరాటం కొనసాగిస్తామని సంయుక్త కిసాన్ మోర్చ, కార్మిక సంఘ ఐక్యవేదిక నాయకులు అన్నారు. ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శుక్రవారం ఐక్య వేదిక సమావేశం జరిగింది. పలువురు నాయకులు మాట్లాడుతూ మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలన్నారు. రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక, రవాణ, ఖనిజ, సకల సంపదలను అదాని, అంబాని వంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఈ నెల 26 రిపబ్లిక్ డే రోజున ఏలూరులో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలుపుతామన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం సహాయ కార్యదర్శి శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ నాయకులు శ్రీనివాస్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రవి, డీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, సీఐటీయూ నాయకులు సోమయ్య, ఏఐటీయూసీ నాయకులు రెడ్డి శ్రీనివాస్‌డాంగే, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

పల్లాకు తెగులును ఆదిలోనే గుర్తించాలి



పెసర పంటను పరిశీలిస్తున్న అధికారులు

పెదపాడు, జనవరి 19: పెసర, మినుము పంటల్లో పల్లాకు తెగులు ఆదిలోనే గుర్తించడం ద్వారా నివారణ సాధ్యమని మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. కొత్తూరు, ముప్పర్రు గ్రామాల్లో అపరాల పంటను శుక్రవారం పరిశీలించారు. పల్లాకు తెగులు నివారణకు ఇమెడోక్లోప్రిడ్ మందు పిచికారీ చేసుకోవాలన్నారు. వేపనూనె ఎకరాకు ఒక లీటరు చొప్పున పిచికారీ చేసుకుని రసం పీల్చే పురుగుల ఉధృతిని తగ్గించాలని సూచించారు. ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హిందూ ఆలయాలపై దేవదాయ శాఖ పెత్తనం సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న గౌరయ్య

ఏలూరు రూరల్, జనవరి 19: హిందూ ఆలయాలపై దేవదాయ శాఖ పెత్తనం సరికాదని, ఎండోమెంట్ వ్యవస్థను తొలగించాలని విమోచన సమితి డిమాండ్ చేసింది. వైఎంహెచ్ఏ ప్రాంగణంలో హిందూ ధర్మరక్షా సమితి ఆధ్వర్యంలో కెఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన శుక్రవారం హిందూ ప్రజా వేదిక నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు చేదులూరి గౌరయ్య మాట్లాడుతూ అయోధ్యలో రామమందిర నిర్మాణం ఒక చరిత్ర అన్నారు. రామమందిరం ప్రతిష్ఠను వివిధ పార్టీలు బహిష్కరిస్తున్నట్లు చెప్పడం దారుణమన్నారు. హిందూ దేవాలయాలపై, ఆస్తులపై ఎండోమెంట్ పెత్తనం సరికాదని ప్రభుత్వం ఎండోమెంట్ వ్యవస్థను తప్పించాలని డిమాండ్ చేశారు. హిందూ ఆలయాలు, ఆస్తులు వందల కోట్లు ఉన్నాయని, స్థలాలను, అద్దెకు ఇస్తూ ఎండోమెంట్ వ్యాపారం చేస్తోందని మండిపడ్డారు. ఇటీవల 370 జీవో రద్దుచేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి లక్కోజు ఆచార్య, గొల్లపూడి శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, కె.లక్ష్మీతులసి, ఎ.నరసింహరావు, అంగడి రాజశేఖర్, శివశ్రీ సాంబశివరావు, పూర్ణానంద సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.









లింగపాలెం, పోలవరం, బుట్టాయగూడెం, భీమడోలులో అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చి ప్రభుత్వ తీరుపై నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు

అంగన్వాడీల సమస్యలపై

అంబేడ్కర్‌కు విన్నపం

ప్రభుత్వ మొండి వైఖరిపై నిరసన

పోలవరం, జనవరి 19: అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్ సమ్మె శుక్రవారం నాటికి 39వ రోజుకు చేరింది. జిల్లాలో అంగన్వాడీలు అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చి ప్రభుత్వ మొండి వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. పోలవరంలో యూనియన్ మండల కార్యదర్శి పీఎల్ఎస్ కుమారి తదితరులు సమ్మె శిబిరంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అనుసరించి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. అంగన్వాడీ నాయకులు కుబ్ర, సుజాత, ధనలక్ష్మి, సత్యవేణి, జుబేధా, చెరుకూరి మణి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంగన్‌వాడీలపై వివక్ష చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెవైపు సీఎం కన్నెత్తి చూడలేదని అన్నారు. సమస్యలను పరిష్కరించ కుంటే సమ్మె విరమించేది లేదన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. తమ సమస్యలను జగన్మోహన్‌రెడ్డి పరిష్కరించేలా దారి చూపాలంటూ అంబేద్కర్‌ను వేడుకున్నారు. బీజేఎస్ కుమారి, వి.ఈశ్వరి పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: అంగన్వాడీలు అంబేద్కర్‌పేట వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకురాలు తెల్లం రామలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. తెల్లం రామకృష్ణ, మున్నీ, శ్రీదేవి, పుష్ప, రామయమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

● కుక్కునూరు: అంగన్వాడీలు ఆందోళన నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని సీఐటీయూ మండల కార్యదర్శి వై.సాయి కిరణ్ అన్నారు. పాదయాత్ర సమయంలో అండగా ఉంటానని చెప్పిన జగన్ ఇప్పుడు మాట పరిచారన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఎన్ని కష్టాలు ఎదురైనా ఆందోళన కొనసాగిస్తామన్నారు. నాయకులు వై.నాగేంద్ర రావు, రాయిరమణ, సుజాత, నాగమణి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: అంగన్‌వాడీ కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కనీస వేతనాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. పి.ఫణివర్ధిని, ఎన్.మార్తమ్మ, ఎం.సత్యవతి, బాబీ తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: అంగన్వాడీలు ర్యాలీగా వెళ్లి ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. గుత్తికొండ వెంకట కృష్ణారావు, యంత్రపాటి సుజాత,రత్నకుమారి తదితరులు నాయకత్వం వహించారు.

● చింతలపూడి: అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన శిబిరం వద్ద ఏలూరు రోడ్డుపై నల్ల రిబ్బన్లు కట్టుకుని ప్రదర్శన, నినాదాలు చేశారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో సరోజిని, మాణిక్యం మాట్లాడుతూ ఎక్కడ ఉన్నావు జగనన్న.. నీవు ఏమి విన్నావు జగనన్న.. మాట తప్పావు జగనన్న.. మడమ తిప్పావు జగనన్న అంటూ నినాదాలు చేశారు. సీఐటీయు నాయకులు నత్తా వెంకటేశ్వరరావు, డి.సత్యనారాయణ సంఘీభావం తెలిపారు.

● భీమడోలు: అంబేద్కర్ ఆశయాలు తుంగలోకి తొక్కి ఆయన విగ్రహాలను ఆవిష్కరించడం జగన్మోహన్‌రెడ్డికే చెల్లిందని సీఐటీయూ మండల అధ్యక్షురాలు స్వర్ణకుమారి అన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి నిరసన వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. లక్ష మందికి పైగా దళిత, బలహీన వర్గాల మహిళలు 39 రోజులుగా తమ ఆకలి కేకలు వినిపిస్తుంటే పట్టించుకోని ముఖ్యమంత్రి విగ్రహాల ఆవిష్కరణకే పరిమితమై అంబేద్కర్ చెప్పిన సమానత్వానికి, మహిళల హక్కులకు పాతర వేస్తున్నారని విమర్శించారు. యూనియన్ నేతలు చల్లామణి, కనకదుర్గ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ తరలివెళ్లిన బస్సులు



బస్సుకు జెండా ఊపుతున్న చైర్‌పర్సన్ లక్ష్మి

జంగారెడ్డిగూడెం, జనవరి 19: విజయవాడలో జరిగే అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జంగారెడ్డిగూడెం ఉంచి సుమారు 300 మంది ప్రత్యేక బస్సులలో వెళ్లారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి శుక్రవారం బస్సుకు పచ్చ జెండా చూపి ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, పెసరుగంటి త్రిమూర్తులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: మండలం నుంచి అధిక సంఖ్యలో బస్సుల్లో దళితులు తరలివెళ్లారు. బస్సులను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నియోజక ఇన్‌చార్జి రాజ్యలక్ష్మి ప్రారంభించారు. తహసీల్దార్ ఎస్.శారాశాంతి, ఈవోపీఆర్‌డి ఎం.శ్రీహరి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: మండలం నుంచి 4 ఆర్టీసీ బస్సుల్లో సుమారు 170 మంది వెళ్లినట్లు ఎంపీడీవో కార్యాలయ అధికారులు తెలిపారు. బస్సుల్లో జనం వెళ్లేందుకు ఆయా పంచాయతీల కార్యదర్శులు పర్యవేక్షించారు.

● కామవరపుకోట: మండలంలోని పలు గ్రామాల నుంచి అంబేద్కర్ అభిమానులు, కార్యకర్తలు వివిధ వాహనాల్లో జై భీమ్ నినాదాలు చేస్తూ తరలివెళ్ళారు. కామవరపుకోట, కొత్తూరు, జోగడిగూడెం, అంకాలంపాడు, జలపావారిగూడెం, రామన్నపాలెం, తూర్పుయడవల్లి, రావికంపాడు, తాడిచర్ల, తదితర గ్రామాల నుంచి అంబేద్కర్ అభిమానులు తరలివెళ్లారు.

● చింతలపూడి: పాతబస్టాండ్‌లో అంబేద్కర్ విగ్రహానికి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కంభం విజయరాజు పూలమాల వేసి నివాళులర్పించి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ జానకిరెడ్డి, జడ్పీటీసీ నీరజ, ఎంపీపీ రాంబాబు, పలువురు తరలివెళ్ళారు.

● టి.నరసాపురం: మండలంలోని బంధంచర్ల, టి.నరసాపురం, రుద్రకోట రాజుగూడెం గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో అంబేద్కర్ యువత, వైసీపీ నాయకులు ఇతర ప్రజా ప్రతినిధులు తరలి వెళ్లారు.

● లింగపాలెం: వివిధ సంఘాల నాయకులు, ప్రజలు అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలివెళ్ళారు. వివిధ పార్టీల నాయకులు బస్సులు సమకూర్చడంతో ప్రజలు తరలివెళ్ళారు.

● ఉంగుటూరు: మండలంలో వివిధ గ్రామాల నుంచి వైసీపీ కార్యకర్తలు తరలివెళ్లారు. నారాయణపురం నుంచి జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సుల్లో కార్యకర్తలు బయలుదేరారు. మరడ వెంకట మంగారావు, పుప్పాల గోపి, బండారు నాగరాజు, తదితరులు జెండా ఊపారు.

నేడు టీడీపీ నియోజకవర్గ సమావేశం

భీమడోలు, జనవరి 19: టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు క్యాంపు కార్యాలయంలో ఉంగుటూరు నియోజకవర్గ సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం తెలిపారు. మండల, గ్రామ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొనాలన్నారు. ఈనెల 29న భీమడోలులో రా కదలిరా బహిరంగ సభపై చర్చించనున్నారు.

జగన్‌ను ఇంటికి పంపి రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తాం

దెందులూరు, జనవరి 19: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్ షర్మిల అధ్యక్షతన పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని, రాహుల్ దేశానికి ప్రధాన మంత్రి కావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డీవీఆర్‌కే చౌదరి అన్నారు. నియోజకవర్గ ముఖ్యకేంద్రం దెందులూరులో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రత్యేక హోదా ఇవ్వడంతో పాటు పోలవరం ప్రాజెక్ట్ నిర్మించి తీరతామన్నారు. షర్మిల నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమవుతుందన్నారు.

● ఏలూరు కార్పొరేషన్: పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల, సీడబ్లూసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా గిడుగు రుద్రరాజు నియామకంపై కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు కృతజ్ఞతలు తెలియచేసినట్టు రామ్మోహన్‌రావు ప్రకటించారు.

ఎన్నికల విధుల మినహాయింపుపై పీఆర్టీయూ వినతి

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 19: సార్వత్రిక ఎన్నికల్లో 55 ఏళ్ల పైబడిన ఉద్యోగులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులను విధుల నుంచి మినహాయించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేసినట్టు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు తెలిపారు. ఎన్నికల విధుల ఆర్డర్లు జారీ అయిన తర్వాత ఇటువంటి ఇబ్బందులున్న వారు డ్యూటీ ఆర్డర్లను రద్దుచేయించుకోవడం కష్టసాధ్యని, మానవతాదృక్పథంతో ముందస్తుగానే మినహాయింపులు ఇవ్వాలని కోరామన్నారు. 12వ పీఆర్సీ విధివిధానాలను వేగవంతంగా రూపొందించాలని, ఈలోగా 30శాతం మధ్యంతర భృతి (ఐఆర్)ను రాష్ట్రప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రకటించి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి జగన్‌కు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1,2 పరీక్షలు, డీవైఈవో, డిగ్రీ కళాశాలల అధ్యాపక పోస్టుల భర్తీకి జిల్లాలో పనిచేస్తున్న టీచర్లు, హెచ్ఎంలు మొత్తం 45మంది దరఖాస్తులను జిల్లావిద్యాశాఖకు ప్రతిపాదించగా ఆమోదిస్తూ డీఈవో ఉత్తర్వులు జారీచేసారని ఆంజనేయులు వివరించారు.

భూ యజమాన్య హక్కుల చట్టం రద్దు చేయాలి

పెదపాడు, జనవరి 19: రైతులకు, ప్రజలకు నష్టం కలిగించే భూ యాజమాన్య హక్కుల చట్టం - 2022 (ల్యాండ్ సీలింగ్ టైటిలింగ్ యాక్ట్ - 2022) రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెదపాడులోని నర్రా ఆంజనేయులు భవనంలో సీపీఎం సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. జగన్మోహనరెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన భూ యజమాన్య హక్కుల చట్టం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంబానీ, అదానీ వంటి కార్పొరేటర్లకు రైతుల భూములను కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నీతి ఆయోగ్ తీసుకువచ్చిన ఈ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం దుర్మార్గమని పలువురు వాపోయారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శ్రీనివాసరావు, రాహేల్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

అంబికాదేవి సన్నిధిలో శ్రీచక్ర కుంకుమార్చన



ఏలూరుకార్పొరేషన్, జనవరి 19 : సత్రంపాడు అంబికాదేవి ఆలయంలో శుక్రవారం శ్రీచక్ర కుంకుమార్చన నిర్వహించారు. తొలుత అమ్మవారికి ఆలయ అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలోభక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అంబికా కుటుంబ సభ్యులు అమ్మవారికి అర్చనలు, పూజలు నిర్వహించారు. సౌభాగ్యలక్ష్మీదేవి, బావిశెట్టివారిపేటలోని కనకదుర్గాంబ అమ్మవారి ఆలయాల్లో కుంకుమార్చన చేశారు.

లలితాదేవికి కుంకుమార్చన

కామవరపుకోట, జనవరి 19 : లక్ష్మీహయగ్రీవ లలితా పీఠంలో లలితాదేవికి భక్తులు కుంకుమార్చన చేశారు. అమ్మవారికి పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గకుమారాచార్యులు, సత్య శ్రీనివాసాచార్యులు అభిషేకాలు నిర్వహించి అనంతరం విశేష అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు దర్శించుకుని కుంకుమార్చనలు నిర్వహించారు.

ఇంటింటికి రామ జన్మభూమి అక్షింతలు

కామవరపుకోట, జనవరి 19 : అయోధ్య శ్రీరా ముని పూజిత అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేసే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. చెలికాని భాస్కరరావు ఆధ్వర్యంలో మహిళా ప్రతినిధులు జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ జెండాలు, బ్యానర్లతో పలు గ్రామాల్లో ప్రదర్శనలు జరిపారు. ఈ నేపథ్యంలోనే ఇంటింటికి అక్షింతలు అందజేశారు. కళ్ళచెరువు, పోలాసిగూడెం, కె.ఎస్.రామవరం తదితర గ్రామాల్లో పవిత్ర అక్షింతల ఇంటింటి పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగింది.

శంకరాచార్యుని విగ్రహాన్ని నెలకొల్పాలి

ఏలూరు రూరల్, జనవరి 19: రాష్ట్రంలో ప్రభుత్వం అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పడం స్వాగతించాల్సిన విషయమేనని, అలాగే ఆదిశంకరాచార్యుని విగ్రహాన్ని కూడా నెలకొల్పాలని ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ఆదిశంకరాచార్యుని విగ్రహాన్ని భారీస్థాయిలో నెలకొల్పారని, చినజీయర్ స్వామిజీ, రామానుజం విగ్రహాన్ని నెలకొల్పారని గుర్తు చేశారు. అనేక సామాజిక వర్గాలకు శంకరాచార్యులు ఆరాధ్యదైవం అన్నారు. ప్రభుత్వం శంకరాచార్యుని విగ్రహాన్ని నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

టి.నరసాపురం, జనవరి 19: మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తానని సామాజిక వేత్త పెండ్యాల అభిషేక్‌బాబు తెలిపారు. బొర్రంపాలెంలో అభిషేక్ ఆధ్వర్యంలో మత్స్యకారుల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బత్తుల రమేష్, ఉపాధ్యక్షుడిగా కొత్తూరి వెంకటేష్, కార్యదర్శి ఎం.ఏసు, కోశాధికారి బుడుపుల రాంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అభిషేక్ బాబు మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నీ అందే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గుండె పోతురాజు, ధనరాజు, చిట్టియ్య, జక్రయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద టీడీపీ నేతల ధర్నా



బుట్టాయగూడెంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

దళితులను మోసగించిన జగన్

టీడీపీ నేతల నిరసన

ఏలూరు టూటౌన్, జనవరి 19: దళితులను దారుణంగా మోసగించిన సీఎం జగన్ అట్టహాసంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభిస్తున్నాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి మండిపడ్డారు. పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నేతలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. టీడీపీ హయాంలో దళితుల సంక్షేమానికి అమలు చేసిన పథకాలను రద్దు చేసిన జగన్‌కు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే నైతిక హక్కులేదన్నారు. చంద్రబాబు నిర్వహించే రా కదలిరా సభలతో వైసీపీలో వణుకుపుడుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ ఇప్పుడు వారికి ఎమ్మెల్యే సీటు ఇవ్వడం లేదన్నారు. రెడ్డి నాగరాజు, తంగిరాల అరుణ, ఎ.చంద్రశేఖర్, రామారావు, పచ్చా ఉమా, నక్కా అప్పారావు, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే వైసీపీకి పోటీ చేసే అభ్యర్థులే కనబడరని బడేటి చంటి ఎద్దేవా చేశారు. 28వ డివిజన్‌లో శుక్రవారం ప్రజా సంకల్ప యాత్ర నిర్వహించారు. అమలు కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం మరో రెండు నెలల్లో కనిపించదన్నారు. టీడీపీ అరాచకాలను ప్రజలకు వివరించి, ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని చంటి ప్రజలకు హామీ ఇచ్చారు. టీడీపీ జనసేనకు ప్రజామద్దతు ఉందన్నారు. దాసరి ఆంజనేయులు, రెడ్డి నాగరాజు, సురేష్, అరుణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: జగన్‌రెడ్డి నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూనే దళితులను అణగదొక్కుతున్నారని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అన్నారు. ఐదేళ్లుగా జైల్లో మగ్గుతున్న కోడికత్తి శ్రీనుకు మద్దతుగా శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి నిరసన తెలిపారు. వైసీపీ పాలనలో దళితులపై దమనకాండ పెరిగిపోయిందన్నారు. నాలుగున్నరేళ్లలో దళితులపై 6 వేల దాడులు, 188 హత్యలు జరిగాయని తెలిపారు. దళిత డ్రైవర్ అయిన సుబ్రహ్మణ్యంను చంపి డోర్‌డెలివరీ చేసిన వారిని ప్రోత్సహిస్తున్న జగన్‌రెడ్డి దళితద్రోహి అన్నారు. దళితులకు అమలవుతున్న 27 సంక్షేమ పథకాలను రద్దుచేసి దళితులకు అన్యాయం చేస్తూ అంబేడ్కర్ విగ్రహం ప్రారంభోత్సవం పేరుతో దొంగ నాటకాలు ఆడుతున్నారని జగన్‌రెడ్డి ఎన్ని మాటలు చేప్పినా నమ్మడానికి దళితులు సిద్దంగా లేరన్నారు. యంత్రప్రగడ శ్రీనివాసరావు, గద్దె అబ్బులు, గంజి రాజేష్, కె.నాగేశ్వరావు, జాలపర్తి మణికంఠ, ఎన్.వెంకటేశ్వరావు, కె.లాజరు, మానెల్లి బాలు, నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: పాత బస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ దళిత నాయకులు వినతిపత్రం అందజేశారు. బోడా నాగభూషణం మాట్లాడుతూ 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్టినంత మాత్రాన దళితులు నమ్మే స్థితిలో లేరన్నారు. టీడీపీ హయాంలో ఉపాధి కల్పించిన ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని, విదేశీ విద్యా పథకానికి అంబేడ్కర్ పేరు తొలగించి జగన్ విదేశీ విద్యగా పేరు మార్చి అంబేడ్కర్‌ను అవమానపరిచారని, ఇది దళితులందరూ గుర్తుంచుకుంటారని, జగన్ గద్దె దిగడం ఖాయమన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో ఈనెల 21న ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు లయన్స్‌క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు తెలిపారు. ఉషా సంస్థల అధినేత బాలకృష్ణ సౌజన్యంతో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు.
- **ఏలూరు ఎడ్యుకేషన్ :** అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త), మామిళ్ళపల్లి జయప్రకాష్(జేపీ) ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న నాగేంద్ర కాలనీలో మెగా వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు కో-ఆర్డినేటర్ రాజారమేష్ తెలిపారు. వివరాలకు 99481 97214, 86393 05065 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.
- **పెదపాడు :** నాయుడుగూడెం మాజీ సర్పంచ్, కమ్యూనిస్ట్ అభిమాని అక్కినేని సత్యనారాయణ (సత్యం) ధన్యజీవి అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. సత్యం ప్రథమ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు.
- **పెదవేగి :** ముండూరుకు చెందిన బలుసు శ్రీనివాస్‌చౌదరి రూ.2 లక్షల విలువైన వాటర్ ట్యాంకర్‌ను గ్రామానికి అందించారు. ట్యాంకర్‌ను మాజీఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. చనిపోయిన కుటుంబ పెద్దల జ్ఞాపకార్థం ఇలాంటివి వితరణ చేయడం గొప్ప విషయమని ఆయన చెప్పారు. బలుసు నాగసాయి రమాకాంత్-సంధ్య, ఆలూరి జ్యోత్స్న- సోమశేఖర్, గారపాటి చినవాసు పాల్గొన్నారు.
- **ఏలూరు క్రైం :** దెందులూరు సమీపంలో జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని స్పీడ్‌గన్‌తో పరిశీలించి పరిమితికి మించిన వాహనదారులకు రవాణా శాఖ అధికారులు, పోలీసులు జరిమానా విధించారు. దెందులూరు ఎస్ఐ స్వామి, ఏలూరు ఎంవీఐ బద్దు నాయక్, సిబ్బంది వాహనాల వేగాన్ని పరిశీలించారు.
- ఏలూరు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు విజయవాడ రైల్వే సేఫ్టీ సెక్యూరిటీ కౌన్సిలర్ గురునాథ్ అవగాహన సదస్సులు నిర్వహించారు. రైలు ఆగిన తరువాతే ప్రయాణికులు ఎక్కాలని, కదిలిన రైలును ఎక్కకూడదని సూచించారు. గ్యాస్ సిలెండర్లు, పేలుడు పదార్థాలు, మండే స్వభావం కలిగే పదార్థాలు, ద్రవాలు రైళ్లలో తీసుకువెళ్లకూడదన్నారు.









చాట్రాయి.. కైకలూరు.. ముసునూరులో అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్వాడీలు.. కలిదిండిలో మోకాళ్లపై నిలబడి నిరసన

విగ్రహం ఏర్పాటుతో సరా..?

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తే సరిపోదని ఆయన ఆశయమైన సామాజిక న్యాయం ఏదని పలువురు నాయకులు ప్రశ్నించారు. 39 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేసి వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నా సీఎం జగన్ పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహాలకు వినతులు సమర్పించి పలు రూపాల్లో నిరసన తెలిపారు.

- అంబేడ్కర్ సామాజిక న్యాయం అంటే ఇదేనా?
- అంగన్వాడీల నిరసన
- అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రం సమర్పణ

చాట్రాయి, జనవరి 19: అధికారంలో ఉన్న పాలకులు అంబేడ్కర్ ఆశయాలు అమలు చేయకుండా, ఆయన భారీ విగ్రహం ప్రతిష్టిస్తే ఎవరికి ఉపయోగమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. రాజు, అంగన్వాడీ యూనియన్ నాయకులు విజయ, ప్రమీల, నిర్మలజ్యోతి ప్రశ్నించారు. చాట్రాయిలో శుక్రవారం అంగన్వాడీలు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందల కోట్ల ప్రజా ధనం ఖర్చు పెట్టి తామే అసలైన అంబేడ్కర్ వాదులమని గొప్పలు చెప్పుకోవటం వల్ల ఫలితం ఉండదని తమలాంటి చిరుద్యోగులకు న్యాయం చేస్తేనే అంబేడ్కర్ ఆత్మకు శాంతి అన్నారు. అన్ని గ్రామాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

ముసునూరు: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు జి.రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ముసునూరు ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి అంగన్‌వాడీలు పూలమాలలు వేసి, నివాళులు అర్పించి, వినతిపత్రం సమర్పించిన అనంతరం నిరసన తెలిపారు. అంగన్‌వాడీల డిమాండ్‌లను పరిష్కరించేవరకు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె కొనసాగిస్తామని రాజు స్పష్టం చేశారు. యూనియన్ నాయకులు పి.రాజకుమారి, కె.విద్యావతి, మేరీ సులోచన, శ్యామల, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం

నూజివీడు టౌన్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వానికి సద్బుద్ధి ప్రసాదించాలని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో నూజివీడు శ్రీనివాసా సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ నూజివీడు అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఆర్ హనుమాన్లు, జి.రాజు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, మణి, పద్మ, విజయలక్ష్మి, ఝాన్సీ, రజినీ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: తమ సమస్యల పరిష్కారంపై జగన్‌కు చిత్తశుద్ధిలేదని అంగన్‌వాడీ వర్కర్లు ధ్వజమెత్తారు. ఆగిరిపల్లిలో అంగన్‌వాడీలు హైస్కూల్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి రాజులపాటి చంటి మాట్లాడుతూ ఏ సామాజిక న్యాయం కోసం అంబేడ్కర్ పోరాడారో అది నెరవేరడం లేదని, అంగన్‌వాడీలు 39 రోజులుగా సమ్మె చేస్తుంటే వారి ప్రధాన డిమాండ్ అయిన జీతాల పెంపు విషయాన్ని ప్రభుత్వం పక్కన పెట్టడం శోచనీయమన్నారు.

కైకలూరు: ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని అంగన్వాడీ యూనియన్ నాయకురాలు పి. సుజాత అన్నారు. శుక్రవారం కైకలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద తమ డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. వైసీపీ నాయకులైనా సీఎం దృష్టికి తమ సమస్యలు తీసుకువెళ్లి అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. యూనియన్ నాయకులు ఎల్. మీనాకుమారి, విజిత, ఝాన్సీ, రమణ, ఉషా, తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని కోరుతూ ముదినేపల్లిలోని నిరసన దీక్షా శిబిరంలో అంగన్వాడీలు అంబేడ్కర్ చిత్రపటం వద్ద వినతిపత్రం ఉంచి సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. యూనియన్ నాయకులు సూరపనేని అరుణ కుమారి, సొంగా మణి, బండి పద్మ ఆధ్వర్యంలో ప్రదర్శనగా వెళ్లి ముదినేపల్లి సబ్ స్టేషన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మెమొరాండం సమర్పించారు.

మోకాళ్లపై నిలబడి నిరసన

కలిదిండి: తమ సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడటం దారుణమని అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కలిదిండిలో అంగన్‌వాడీలు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. సమస్యల పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. నేతలు అబిదా బేగం, విజయలక్ష్మి, శాంతి కుమారి, లావణ్య, లలిత, రాజేశ్వరి పాల్గొన్నారు.

మండవల్లి: తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన చేస్తామని, బెదిరింపులకు భయపడమని అంగన్వాడీ యూనియన్ నాయకులు చెల్లమ్మ, విజయలక్ష్మీ హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తమ డిమాండ్లు సమస్యలు పరిష్కారంచాలంటూ అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష శుక్రవారం కూడా సాగింది.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

భూ హక్కు బదలాయింపు చట్టం రద్దు చేయాలి

కైకలూరు, జనవరి 19: భూహక్కు బదలాయింపు చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని కైకలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు కైకలూరు తహసీల్దార్ బి. మురళీకృష్ణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం తీసుకువచ్చిన భూహక్కు చట్టం అస్తవ్యస్తంగా ఉందని ఈ చట్టంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని, న్యాయసమీక్ష జరిపి చట్టంలోని లోపాలు సరిదిద్దాలని డిమాండ్ చేశారు. సీనియర్ న్యాయవాది గురజాడ ఉదయశంకర్, బార్ అసోసియేషన్ సభ్యులు బి. లక్ష్మణరావు, చావలి శంకరశాస్త్రి, కె రమాదేవి, బి. ఇందిర, అడగర్ల రాంబాబు, కట్టా శ్రీనివాసరావు, గంగాధరరావు, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రామ జన్మభూమి చరిత్ర పుస్తకావిష్కరణ

కైకలూరు, జనవరి 19: 500 ఏళ్లనాటి అయోధ్య రామాలయం చరిత్రను తెలుగు ప్రజలకు తెలిపేందుకే ప్రత్యేక పుస్తకాన్ని ప్రజలందరికీ పంపిణీ చేస్తున్నట్లు కైకలూరు ఎస్‌బీఐ మేనేజర్ పి. శేఖర్ తెలిపారు. శుక్రవారం కైకలూరు శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో పుస్తకాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఏలూరు తపనా ఫౌండేషన్ అధ్యక్షుడు తపనా చౌదరి ఆధ్వర్యంలో 300 పుస్తకాలు, రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో 2200 పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తపనా ఫౌండేషన్ సభ్యుడు పంచకల రఘు, సేవాసమితి కార్యదర్శి యు రాజేశ్వరరావు, ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి పాములు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి వితరణ

ముసునూరు, జనవరి 19: మండలంలోని గోపవరం ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ మహిళా కార్యకర్త రాచిబ్రోలు భూలక్ష్మి(40) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ నాయకుడు ఉప్పలపాటి గణేష్ శుక్రవారం అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు నగదును మృతురాలి కుమారుడు నవీన్‌కు అందజేశారు. సాయిల అనిల్, వడ్లపట్ల మురళీమోహన్, చిలకంటి శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు



బోర్వంచలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకుల నిరసన

కోడికత్తి శ్రీనుకు మద్దతుగా నిరసనలు

కైకలూరు, జనవరి 19: దళిత యువకుడ్ని ఐదేళ్లుగా జైలులో ఉంచి జగన్మోహన్ రెడ్డి పైశాచికానందాన్ని పొందుతున్నాడని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. శుక్రవారం కైకలూరులో టీడీపీ యువ నాయకుడు కొడాలి వినోద్ ఆధ్వర్యంలో కోడి కత్తిశ్రీనుకు న్యాయం చేయాలని, దళితులపై దమనకాండ ఆపాలని నిరసన కార్యక్రమం చేపట్టి తాలుకా సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ కోడికత్తి శ్రీను కుటుంబానికి న్యాయం జరిగేవరకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పోరాడతామని హెచ్చరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పీజేఎస్ మాల్యాద్రి, యాదవ సాధికార డైరెక్టర్ గంగుల ఏసురాజు, తెలుగు మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, మైనార్టీ నాయకుడు బాషీద్, ఎస్సీసెల్ నాయకులు పంతగాని సురేష్, పాముల జోసఫ్ తంబి, చాబత్తిన విజయ్, కురేళ్ళ ఇస్సాక్, పళ్లెం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: దళితులపై దమనకాండ ఆపాలి.. కోడికత్తి శ్రీనుకు న్యాయం చేయాలని కోరుతూ నూజివీడు మండలం బోర్వంచ గ్రామంలో టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సంగీతరావు మాట్లాడుతూ జగన్ ఎస్సీలను రాజకీయ పావులుగా వినియోగిస్తున్నాడని, ఇందులో భాగంగానే దళితుడు శ్రీనును బలిపశువును చేశారన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్ళించి జగన్ దళితద్రోహిగా మారాడన్నారు. ఎస్సీసెల్ నాయకులు పాల్గొన్నారు.

దళితుల పక్షపాతినని చెప్పడం హాస్యాస్పదం..

చాట్రాయి: కాకినాడలో దళిత డ్రైవర్‌ను హతమార్చి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీని సమర్థిస్తున్న సీఎం జగన్ తాను దళితుల పక్షపాతిననడం హాస్యాస్పదమని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ ఆరోపించారు. భారీ అంబేడ్కర్ విగ్రహం పెట్టినంత మాత్రాన సరిపోదని పాలనలో ఆచరించాలన్నారు. వైసీపీ పాలనలో దళితుల హత్యలు అణచివేతలు వెక్కిరిస్తున్నా పాలకులు పట్టకపోవటం శోచనీయమన్నారు. కోడికత్తి కేసులో నిందితుడైన దళితుడు శ్రీను సెంట్రల్ జైలులో దీక్ష చేస్తున్నాడంటే సిగ్గుపడాలన్నారు. తక్షణమే అతనిపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. విదేశీ విద్యకు ఇచ్చే స్కాలర్‌షిప్ పథకానికి అంబేడ్కర్ పేరు తొలగించి జగన్మోహన్ రెడ్డి పేరు పెట్టుకోవటం అంబేడ్కర్‌ను అగౌరవపరచడమే అన్నారు.



వైసీపీ రివర్స్ టెండరింగ్‌తో ప్రజల పాట్లు

రహదారి నిర్మించాలని జన సైనికుల ఆందోళన

ముసునూరు, జనవరి 19: వైసీపీ రివర్స్ టెండరింగ్ వల్ల నిలిచిన రమణక్కపేట-కొండపర్వ ప్రధాన రహదారి నిర్మాణాన్ని పూర్తిచేయాలని నియోజకవర్గ జనసేన నాయకుడు పాశం నాగబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం రహదారిపై జనసేన నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఈ రహదారిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు కంకర వేసి, ఫినిషింగ్ దాదాపు పూర్తిచేసి, తీరా బీటీ రోడ్డు వేసే సమయానికి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ విధానం అమలుచేయడంతో రహదారి నిర్మాణం ఆగిపోయిందన్నారు. ఐదేళ్ళ పాలన పూర్తికావస్తున్నా నేటికి ఈ రహదారి నిర్మించకపోవడం జగన్‌రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. నియోజకవర్గం లో అనేక రహదారులు రివర్స్ టెండరింగ్ వల్ల అభివృద్ధికి నోచుకోక, సగంలోనే ఆగిపోయాయని, సంబంధిత కాంట్రాక్టర్లకు చేసిన పనులకు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిని ఈ ప్రభుత్వం తీసుకువచ్చిందని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైన మధ్యలో ఆగిపోయిన రహదారులను అభివృద్ధి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నాగబాబు డిమాండ్ చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆలయాన్ని శుభ్రపరిచిన బీజేపీ నాయకులు



నూజివీడు టౌన్, జనవరి 19: అయోధ్య రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఆలయాలను శుభ్రం చేయాలని ప్రధాని మోదీ పిలుపు మేరకు నూజివీడు వేణు గోపాల స్వామి ఆలయాన్ని బీజేపీ నాయకులు శుభ్రపరిచారు. ఆలయంలో ఏలూరు జిల్లా కార్యదర్శి మాగంటి వాసు ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తలు రామ నామం జపిస్తూ ఆలయాన్ని శుభ్రపరిచారు. ఆర్ఎస్ఎస్ సభ్యులు మదన్, చిన్నం శ్రీనివాస్, కిషోర్, అంబటి మల్లేశ్వరరావు, పాతూరి రవికాంత్, వసుంధరాదేవి తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీధర్‌కు పీహెచ్‌డీ



ఆగిరిపల్లి, జనవరి 19: ఆగిరిపల్లిలోని ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఈసీఈ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న సేవా శ్రీధర్ బాబుకు విజయవాడ కేఎల్ యూనివర్శిటీ పీహెచ్‌డీని ప్రదానం చేసింది. కేఎల్ వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పోలయ్య ఆధ్వర్యంలో ఈ-హెల్త్ కేర్ కమ్యూనికేషన్స్‌పై పరిశోధన గావించారు. ఎన్ఆర్ఐ కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్. వెంకట్రావు, ప్రిన్సిపాల్ నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వి.సాంబశివరావు తదితరులు శ్రీధర్‌బాబుని అభినందించారు.

ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి విజేతల ఎంపిక

చాట్రాయి, జనవరి 19: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల విజేతలను అధికారులు ప్రకటించారు. పురుషుల విభాగంలో వాలీబాల్, కబడ్డీలో చిత్తపూరు-2 జట్టు, ఖోఖోలో కోటపాడు జట్టు, క్రికెట్‌లో పోలవరం జట్టు విజయం సాధించాయి. మహిళల విభాగంలో వాలీబాల్ మర్లపాలెం జట్టు, కబడ్డీ చనుబండ-2 జట్టు, ఖోఖో, క్రికెట్‌లో కోటపాడు జట్లు గెలుపొందినట్లు ఎంపీడీవో దుర్గాప్రసాద్ తెలిపారు. షటిల్ పోటీలు జరపాల్సి ఉందన్నారు. విజేతలను అధికారులు అభినందించారు. ఈవోపీఆర్డీ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం పథకాలను పక్కదోవ పట్టించిన జగన్

ఆగిరిపల్లి, జనవరి 19: ఆగిరిపల్లి మండలం ఈదులగూడెం, సీతారాంపురం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కొవ్వలి బాబూరావు, వైఎస్ దొరై కేంద్ర ప్రభుత్వ పథకాలతో ఎంతమంది లబ్ధిపొందుతున్నారని గ్రామస్థులను ఆరా తీశారు. ఉచిత రేషన్ బియ్యం, ప్రధాన మంత్రి ఉజ్వల గ్యాస్, ఉపాధి పథకం కింద 100 రోజుల పని, ఇంటింటికీ మరుగుదొడ్డి వంటి అనేక ప్రజా సంక్షేమ పథకాలు కేంద్రం అమలు చేస్తోందని, అయితే రాష్ట్రప్రభుత్వం వీటిని పక్కదోవ పట్టించటం వల్ల ప్రజలకు వీటి గురించి తెలియటం లేదని, ఈ పథకాలపై మారుమూల పల్లెలకు తెలియచేయటమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమన్నారు. నానో యూరియా, డ్రోన్‌ల ఉపయోగాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. నోడల్ ఆఫీసర్ చెన్నారావు, సర్పంచ్‌లు అత్తి మురళీ, చిట్నేని విజయ, గ్యాస్ కంపెనీ అధినేత పాలడుగు శ్రీనివాస్ పాల్గొని ఉజ్వల ఉచిత గ్యాస్ కార్డులు, ఆయుష్ హెల్త్‌కార్డులు అందజేశారు.

ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వ లక్ష్యం



ముసునూరు, జనవరి 19: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా ఇన్ చార్జ్ వైద్య ఆరోగ్య శాఖాధికారి జాస్తి జగన్‌మోహన్‌రావు అన్నారు. శుక్రవారం లోపూడిలో సురక్ష-2 వైద్యశిబిరాన్ని వైస్ ఎంపీపీ కోటగిరి రాజా, జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ప్రతాప్ ప్రారంభించారు. వైద్యులు, సిబ్బందికి ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో పలు సూచనలిచ్చారు. రమణక్కపేట పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ కరీముల్లా, డాక్టర్ అవినాష్‌తోపాటు డాక్టర్ రవళి, డాక్టర్ ప్రవీణ్ 556 మందికి పలు వైద్యపరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ పేరం కృష్ణ, ఈవోపీఆర్డీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నూజివీడు ఇన్‌చార్జి ముద్దరబోయిన

పథకాలు రద్దుచేసి..
నా దళితులంటే ఎలా?

నూజివీడు, జనవరి 19: దళితులకు ప్రయోజనం కలిగించే పథకాలను రద్దుచేసిన జగన్‌కు నా ఎస్సీలు, నా ఎస్టీలు అనే అర్హత లేదని, నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడు పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళితులకు రాజ్యాంగబద్ధంగా అమలు చేయాల్సిన 27 సంక్షేమ పథకాలను వైసీపీ నిలిపివేసిందని, పైగా నాలుగున్నరేళ్లలో 6 వేల దాడులు, 188 మంది హత్యలు జరిగాయని, చివరికి వైసీపీ ఎమ్మెల్సీ తన కారు డ్రైవర్‌ను కూడా హత్య చేయడం చూస్తే దళితులకు ఈ ప్రభుత్వంలో రక్షణ ఉందా? అనే అనుమానం కలుగుతోందన్నారు. వ్యవసాయ భూముల ఏర్పాటుతో దళితుల్లో ఆత్మగౌరవాన్ని పెంచే దిశగా టీడీపీ భూమి కొనుగోలు పథకాన్ని ప్రవేశపెడితే జగన్ దాన్ని రద్దుచేశారని, పెళ్లి కానుకను సైతం అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ శాఖల్లో 50 వేల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా నిలిపివేశారని, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌ను రద్దుచేశారని, కోడికత్తి డ్రామాతో దళితుడిని జైలుపాలు చేశాడని, ఇదేనా దళితులపై జగన్‌కున్న ప్రేమ అన్నారు.



విజయవాడ వెళ్లే బస్సును ప్రారంభిస్తున్న అధికారులు

జనాన్ని తరలించిన అధికారులు!

మండవల్లి, జనవరి 19: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు మండలం నుంచి జనాన్ని తరలించే ప్రక్రియను అధికార యంత్రాంగం చేపట్టింది. డ్వాక్రా మహిళలను, పలువురు గ్రామస్థులను తరలించే బస్సులకు ఎమ్మార్వో, పంచాయతీ కార్యదర్శులు జెండా ఊపి ప్రారంభించారు. కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ వీర్రాజు, ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గ ప్రసాద్ సంకల్ప సభకు వెళ్లే బస్సులను జెండా ఊపి ప్రారంభించారు.



ముదినేపల్లి: విజయవాడ స్వరాజ్య మైదానంలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవానికి ముదినేపల్లి మండలం నుంచి వివిధ వర్గాల నాయకులు, పలు సంఘాల కార్యకర్తలు తరలి వెళ్లారు. ముదినేపల్లిలో సంకల్ప యాత్ర నిర్వహించారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగ జగన్ బాబూరావు, మాదిగ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసుపోగు దానియేలు ఆధ్వర్యంలో దళిత సంఘాల కార్యకర్తలు వెళ్లారు.



ముదినేపల్లి వెలుగు కార్యాలయం

మొన్న అల్లూరు.. నిన్న పెయ్యేరు

- లక్షలాది రూపాయల రికవరీ సొమ్ము పక్కదారి
- స్వయం సహాయక సంఘాలపై కొరవడిన పర్యవేక్షణ
- నామమాత్రపు విచారణలు.. సభ్యుల గగ్గోలు

స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడింది. సంఘాల ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ కొరవడింది. సభ్యులు చెల్లించాల్సిన రుణ వాయిదాల సొమ్ము బ్యాంక్ ఖాతాల్లో జమ కాకుండా పక్కదారి పడుతోంది. పొదుపు సొమ్ము బ్యాంకులకు చేరుతోందా? లేదా అన్న అంశాల పరిశీలన నామమాత్రంగా జరుగుతున్నట్టు స్పష్టమవుతున్నది.

ముదినేపల్లి, జనవరి 19: ముదినేపల్లి మండలంలో ఇటీవల కాలంలో పలు సంఘాలకు సంబంధించి రుణాల రికవరీ సొమ్ము దుర్వినియోగం అయినట్లు సభ్యుల నుంచి అందుతున్న ఫిర్యాదులే ఇందుకు సాక్ష్యం. మండలంలోని అల్లూరులో 2017 నుంచి 2021 వరకు పలు స్వయం సహాయక సంఘాల సభ్యులు చెల్లించిన లక్షలాది రుణాలు వాయిదాల సొమ్మును బుక్ కీపర్ బ్యాంక్‌లో జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడిన ఘటనపై విచారణ ఓ కొలిక్కి రాకముందే పెయ్యేరులో మరో స్వయం సహాయక సంఘం సభ్యులు చెల్లించిన రుణాల వాయిదాలు, పొదుపు సొమ్మును సంఘ అధ్యక్షురాలు బ్యాంక్‌లో జమ చేయని ఘటన ఈ నెల 18న వెలుగుచూసింది. ఈ సంఘ సభ్యులు ముదినేపల్లిలో తమ గ్రూపు ఖాతా ఉన్న బ్యాంక్‌కు వెళ్లి కొత్తగా రుణాలు తీసుకునేందుకు ప్రయత్నించిన సందర్భంలో కొంత సొమ్ము జమ అయినట్లు, పాత రుణాలు రద్దు కాలేదని బయటపడింది. దీనిపై సభ్యులు సంఘ అధ్యక్షురాలిని ఆరా తీయగా, 2021 నుంచి ఆ సంఘ సభ్యులు చెల్లించిన రూ.4.58 లక్షల రుణాలు, పొదుపు వాయిదాల సొమ్ము బ్యాంక్‌లో జమ చేయలేదని వెల్లడైంది. సభ్యులు ఒత్తిడి చేయటంతో వలంటీర్‌గా కూడా వ్యవహరిస్తున్న ఆ సంఘ అధ్యక్షురాలు రూ.1.50 లక్షలు ఇటీవల చెల్లించింది. మిగిలిన సొమ్ము విషయమై సంఘ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు ముదినేపల్లి వెలుగు ఏపీఎం సత్యనారాయణ సంఘ రికార్డులు, బ్యాంక్ ఖాతాలు పరిశీలించగా, అధ్యక్షురాలు ఇంకా రూ.3.08 లక్షలు చెల్లించాల్సి ఉందని తెలిసింది. సంఘ అధ్యక్షురాలికి నమ్మకంగా ఇచ్చిన సొమ్మును బ్యాంక్ ఖాతాల్లో జమ చేయకుండా తమను మోసం చేసిందంటూ సభ్యులు ఆందోళన చేయటంతో ఈ ఏడాది ఫిబ్రవరి 20 నాటికి సొమ్ము చెల్లిస్తానని సంఘ అధ్యక్షురాలు అధికారులకు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చినట్లు కూడా తెలిసింది. అయితే ఈ తతంగం అంతా రెండు సంవత్సరాలుగా జరుగుతుంటే వెలుగు అధికారులు గానీ, బుక్ కీపర్ గానీ పట్టించుకోకపోవటంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. సంఘాల సభ్యులు ఫిర్యాదు చేసేంత వరకు ఏ స్థాయిలోను అక్రమాలను అధికారులు గుర్తించలేకపోవటం చూస్తుంటే నిబంధనల ప్రకారం సంఘాల నిర్వహణపై పర్యవేక్షణ లోపించినట్లు కనిపిస్తున్నది.

చర్యలు తీసుకుంటున్నాం

పెయ్యేరులోని స్వయం సహాయక సంఘ సభ్యుల సొమ్ము బ్యాంకుల్లో జమ చేయని విషయాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటున్నాం. సొమ్ము దుర్వినియోగానికి పాల్పడిన సంఘ అధ్యక్షురాలి నుంచి సభ్యులు చెల్లించిన సొమ్ము రికవరీ చేస్తాం.

-సత్యనారాయణ, ఏపీఎం, వెలుగు శాఖ, ముదినేపల్లి

క్రైం కార్నర్



స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లతో అధికారులు

విజిలెన్స్ దాడులు.. గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

నూజివీడు టౌన్, జనవరి 19: నూజివీడు పట్టణంలో అనధికారికంగా ఉపయోగిస్తున్న గ్యాస్ సిలిండర్లను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ, విజిలెన్స్ తహసీల్దార్ బి.కన్యాకుమారి నూజివీడు పట్టణంలో తనిఖీలు చేపట్టగా టిఫిన్ సెంటర్లో వినియోగిస్తున్న ఆరు సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.17,826లుగా ఉందని, హోటల్ యజమానిపై కేసునమోదు చేసినట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ తెలిపారు. దాడుల్లో డీటీ జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కత్తిపీటతో దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

చాట్రాయి, జనవరి 19: దాడిలో గాయపడిన చీపురుగూడేనికి చెందిన అబ్బదాసరి కృష్ణ (38) విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు ఎస్సై కేసీహెచ్ స్వామి తెలిపారు. చీపురుగూడేనికి చెందిన మృతుడు అబ్బదాసరి కృష్ణ ఈ నెల 17న బూరుగ్గూడెంలో తన చెల్లెలు గద్దల ఆరోగ్యం ఇంటికి వచ్చాడు. అదే రోజు ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం మల్లెలకు చెందిన పత్తిపాటి నాగరాజు కూడా అక్కడికి రావడంతో తన చెల్లెలింటికి ఎందుకు వచ్చావని నాగరాజును ప్రశ్నించడంతో వాగ్వాదం జరిగింది. దీంతో నాగరాజు కత్తిపీటతో కృష్ణ తలపై కొట్టగా అతను తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చింతలపూడి, ఏలూరు ఆసుపత్రులలో చికిత్సకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై స్వామి కేసు నమోదు చేయగా నూజివీడు టౌన్ సీఐ మూర్తి దర్యాప్తు చేస్తున్నారు.

పాత కక్షలతో తాటాకు దడికి నిప్పు

ముదినేపల్లి రూరల్, జనవరి 19 : పాత గొడవల నేపథ్యంలో ముదినేపల్లి మండలం నరసన్నపాలెంలో తాటాకు దడికి నిప్పంటించిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. తన ఇంటి వద్ద తాటాకు దడికి సమీప బంధువు నాగరాజు నిప్పంటించాడని బాధితుడు ముత్యాల భిక్షం ఫిర్యాదు మేరకు ముదినేపల్లి ఏఎస్ఐ పద్మజ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.